ఈనాడు
ప్రకాశం

కోటి ఆశల జలోదయం


- వెలిగొండతో మారనున్న మార్కాపురం జిల్లా రూపురేఖలు
- మహోన్నత ఘట్టం ఆవిష్కరణ నేడే

వెలిగొండ ప్రాజెక్టు సాకారం కావడంతో పశ్చిమ ప్రకాశం ప్రాంతం ప్రకాశించనుంది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తయిన తరుణంలో తమ భవిష్యత్తుకు ఈ రోజు మేలిమలుపుగా నిలుస్తుందని మార్కాపురం జిల్లా వాసులు ఆకాంక్షిస్తున్నారు. ఈనాడు, ఒంగోలు

తాగేందుకు కూడా నీళ్లు ఉండవు.. అమ్మో ప్రకాశం జిల్లానా.. అంటూ బయట ప్రాంతాల వాళ్లు ఇక్కడికి వచ్చేందుకు జంకుతారు. అక్కడ మనం బతకలేమని అనాసక్తత చూపుతారు. కనిగిరి ప్రాంతంలో తీవ్రమైన ఫ్లోరైడ్ సమస్య, యర్రగొండ పాలెం ప్రాంతంలో వేయి అడుగుల దిగువకు వెళితేనే గాని నీటి చెమ్మ తగలదు. వేసవిలో గిద్దలూరు ప్రాంతంలో నీళ్లు కొనుక్కొని తాగాల్సిందే.. మార్కాపురం నీళ్లు ఎప్పుడో వస్తాయో తెలియని పరిస్థితి. మనిషి మనుగడకు కీలకమైన జలం అందుబాటులో లేక ఇక్కడి వారు దశాబ్దాలుగా వలసపోతూనే ఉన్నారు. ఒక్క కనిగిరి ప్రాంతం చూసుకొంటే 60 వేల మందికిపైగా వివిధ రాష్ట్రాల్లో పనులు చేసుకుంటున్నారు. మార్కాపురం జిల్లాలో ఏ గ్రామీణ ప్రాంతం చూసుకున్నా, ఇరవై ఏళ్ల యువకులు అంతంత మాత్రంగానే కనిపిస్తారు. ఎలాగోలా మా బతుకులు దుర్భరంగా ఈడ్చుకొచ్చాం.. మీరైనా మంచి బతుకు చూసుకోండంటూ తల్లిదండ్రులే తమ పిల్లలను ఊళ్లో ఉండనివ్వకుండా పంపించేస్తుంటారు. ఇక్కడి నీరు తాగితే అనారోగ్యం పాలవుతారని, చేతిలో పని లేకుండా ఖాళీగా కూర్చోవాలని ఊరు వదిలిపోవాలని చిన్నప్పటి నుంచి నూరిపోస్తారు. ఆ దుర్భర పరిస్థితులు పోయి మంచి భవిష్యత్తునిచ్చే రోజు రానే వచ్చింది.



విద్యుత్తు కాంతులతో క్రాస్ రెగ్యులేటర్, సుంకేశుల జలాశయం



40 టీఎంసీల జలనిధి

కృష్ణా జలాలు కరవు నేలను తాకితే తొలుత భూగర్భ జలాలు మెరుగై బోర్లలో నీళ్లు అందుబాటులో ఉంటాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 40 టీఎంసీలకు పైగా జలనిధి అందుబాటులో ఉంటే ఊహించనంత మార్పు తెస్తుంది. కిలోమీటర్ల కొద్దీ కృష్ణా జలాలు ప్రవహించి భూగర్భంలో ఫ్లోరైడ్‌ను భూస్థాపితం చేసేస్తాయి. ఫ్లోరైడ్‌తో కూడిన నీళ్లు తాగడం వల్ల పళ్లు ఊడిపోవడం, కాళ్లు వంకరపోవడం, వెన్నెముక ఒంగిపోవడం, ఎముకలు పలచబడి ఎంతోమంది బాధపడుతుండగా, ఇప్పుడు ఆ సమస్య దూరమై ప్రజలకు రోగాల బాధతప్పుతుందని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షకులు రామచంద్రరావు పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండి, ఆయుః ప్రమాణాలు పెరిగితే మరింత ఉత్పాదకత సాధిస్తారని, రానున్న పదేళ్లలో మార్కాపురం రూపురేఖలు మారిపోతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.



క్రాస్ రెగ్యులేటర్ వద్ద సెల్ఫీ దిగుతున్న మహిళలు



ఫీడర్ కాలువలో పారుతున్న కృష్ణా జలాలు

ఇక ఉద్యానమే

పశ్చిమ ప్రాంతంలో విస్తారమైన నేలలున్నా, వర్షం కురిస్తే పంట లేకుంటే మంట అన్నట్లు సాగుకు పెట్టుబడి పెట్టి రైతులు ఎంతో నష్టపోతున్నారు. ఇప్పుడు నీరు కాలువల ద్వారా గాని, బోర్ల ద్వారా గాని పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే పంటలు పండటమే కాదు.. దిగుబడులు పెరిగి ఆదాయాలు పెరుగుతాయి. ఇప్పటికే ప్రభుత్వం 70 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు ద్వారా రైతుల ఆదాయం పెంచాలని ప్రయత్నం చేస్తుంది. ఒకవైపు వెలిగొండ నుంచి కృష్ణా జలాలు, మరోవైపు బెంగళూరు జాతీయ రహదారి అందుబాటులోకి రావడంతో ఉద్యాన పంటల ఎగుమతుల ద్వారా ఇక్కడి రైతు నిజంగా రాజు కానున్నాడనే చెప్పాలి. ఉద్యాన పంటల విస్తీర్ణం పెరిగితే ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటైతే రైతుకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఉద్యాన అధికారి గోపిచంద్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.

త్వరితగతిన అభివృద్ధి

జలవనరులు అందుబాటులోకి వచ్చినందున మార్కాపురం జిల్లాకు తిరుగే లేదని విద్యావేత్త కె.మధుసూదన్ పేర్కొన్నారు. పంటలతో ఆదాయం వృద్ధి చెంది, రానున్న ఐదేళ్లలో మార్కాపురం జిల్లా త్వరితగతిన అభివృద్ధి చెందుతుందన్నారు. నీరు అందుబాటులో ఉంటే పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తారు. పారిశ్రామికీకరణతో సేవా రంగాలు వృద్ధి చెందిన మాదిరి భవిష్యత్తులో వెలిగొండ ఈ ప్రాంత రూపరేఖలను మార్చడంలో ఎలాంటి సందేహం లేదనే అభిప్రాయం వివిధ రంగాలకు చెందిన నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

అందరి చూపు.. వెలిగొండ వైపే..

- నలుమూలల నుంచి తరలిరానున్న జనం
- ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సన్నద్ధం

ఈనాడు, ఒంగోలు

ఆదివారం మధ్యాహ్నం.. 2.54 నిమిషాలు బిరబిరా కృష్ణమ్మ పశ్చిమ ప్రకాశాన పరుగులెత్తింది.. ఏళ్ల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించిందని పశ్చిమ ప్రకాశం వాసులు ఆనందానికి లోనయ్యారు. నిమిషాల వ్యవధిలో ఈ దృశ్యాలు సెల్‌ఫోన్లలో చక్కర్లు కొట్టడంతో ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. కొంతమంది ఫీడర్ కెనాల్ వద్దకు వచ్చి సెల్ఫీలు తీసుకున్నారు. సోమవారం వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి దాదాపు లక్ష మంది వరకు వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది.

వెలిగొండ సొరంగం పనులు పూర్తయి ట్రయల్ రన్ నిర్వహణకు ఇంజినీర్లు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏమైనా అవాంతరాలు ఎదురవుతాయా.. కొంత సందేహం.. కాని దానిని పటాపంచలు చేస్తూ కృష్ణమ్మ సొరంగాలు దాటి కరవు సీమను తాకడంతో అంతటా సంతోషం నెలకొంది. సీఎం చంద్రబాబు నల్లమలసాగర్‌కు నీటిని విడుదల చేసే హెడ్ రెగ్యులేటర్ వద్ద నీళ్లు పరవళ్లు తొక్కాయి. అందరూ కేరింతలు కొట్టారు. మంత్రి డోలా శ్రీబాలావీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఉద్వేగానికి లోనవడంతో ఆనంద బాష్పాలు రాలాయి. సీఎం ఆవిష్కరించే పైలాన్ పనులు పూర్తిచేశారు. అక్కడే బాలికలతో నృత్య ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక చీరలు ధరించిన మహిళలు, వెలిగొండ ఆయకట్టు రైతులు సీఎంతో కలిసి సందడి చేయనున్నారు. పూజలు చేసిన అనంతరం కృష్ణమ్మకు జలహారతిని ఇవ్వనున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ట్రయల్ రన్ నిర్వహించారు. వేయికిపైగా ఏర్పాటు చేసిన బస్సుల్లో 50 వేల మంది వరకు రానున్నారు. ఇతరేతర వాహనాలు, బైకుల్లో వచ్చిన వారికి సభా ప్రాంగణం సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు.



ఫీడర్ కాలువలో కృష్ణా జలాల ప్రవాహాన్ని చూస్తున్న వృద్ధులు, మహిళలు

దోర్నాలలోనే మంత్రులు మకాం

సీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రులు నిమ్మల రామానాయుడు, నారాయణ రంగంలోకి దిగి పనులు పరుగులెత్తించారు. ఎమ్మెల్యేలతో కమిటీలు ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించారు. ఆదివారం మంత్రులు స్వామి, గొట్టిపాటి, పార్థసారథి సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఇక్కడే మకాం వేసి రాత్రి సమయంలో కూడా పనులు పర్యవేక్షించారు.



దోర్నాల బస్టాండు ఆవరణలో ఆదివారం రాత్రి వెలిగొండ ప్రాజెక్టుపై డ్రోన్లతో నిర్వహించిన లేజర్‌షోను ప్రజలతోపాటు వీక్షిస్తున్న మంత్రి పార్థసారథి



గిద్దలూరులో అంకాలమ్మకు బోనాలు సమర్పించేందుకు మహిళలతో కలిసి ప్రదర్శనగా వెళ్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



వెలిగొండ ప్రాజెక్టు నీటి విడుదల నమూనా చిత్రపటం వద్ద మార్కాపురం మండలం బోడపాడు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు



గంటవానిపల్లిలో ముఖ్యమంత్రి సభా ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనకు సిద్ధమైన వేదిక

ప్రత్యేక రంగు చీరలతో మహిళల జలహారతి


మహిళలకు అందించే చీరలు

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడానికి జిల్లాకు రానున్నారు. ఫీడర్ కెనాల్ వద్ద నీటిని వదిలి జలహారతి ఇస్తారు. ఈ కార్యక్రమానికి దాదాపు రెండు వేల మంది మహిళలను ప్రత్యేకంగా ఆహ్వానించారు. నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అతివలందరికీ పసుపు, ఎరుపు రంగు చీరలు పంపిణీ చేశారు. సీఎం నిర్వహించే కృష్ణమ్మకు జలహారతిలో వీరందరూ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి చిరకాలం గుర్తుండిపోయేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

వెలిగొండ మార్కాపురం జిల్లా వరప్రదాయిని : మంత్రి

మార్కాపురం, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు వరప్రదాయినిగా మారనుందని.. మార్కాపురం జిల్లా చరిత్రలోనే నిలిచిపోతుందని మంత్రి పార్థసారథి అన్నారు. నాలుగు జిల్లాల ప్రజలకు తాగునీరు తీర్చే గొప్ప ప్రాజెక్టు అని అన్నారు. ఆదివారం మార్కాపురం కలెక్టరేట్‌లో విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రజలకు కృష్ణాజలాలను అందిస్తుంటే వైకాపా.. .ఈ ప్రాజెక్టును మేమే చేశామని క్రెడిట్ చోరీకి పాల్పడుతుందన్నారు. వైకాపా హయాంలో బడ్జెట్‌లో రూ.4300 కోట్లు నిధులు కేటాయించి రూ.900 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఈ నిధుల్లో 25 శాతం మాత్రమే ఖర్చు చేసి రూ.140 కోట్లు పెండింగ్ పెట్టారన్నారు. కరవు నేలలో సాగు, తాగు నీటికి నీళ్లు పంపిణీ చేస్తుంటే గొడ్డలి పార్టీ ప్రజలను రెచ్చగొట్టే విధంగా చేస్తోందన్నారు. ప్రస్తుతం కృష్ణాజలాల ఆనందంలో ప్రజలు ఉన్నారని ఎవరూ కూడా వైకాపా చేసే మోసాన్ని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయకుండా, కనీసం నీటిని విడుదల చేయకుండా జాతికి అంకితం చేసి ప్రజలను మోసం చేశారన్నారు. నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్ల కాలంలోనే రూ.2500 కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్నారు. నిర్వాసితులను ఆదుకున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. కృష్ణాజలాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ముంపు గ్రామాల్లో పర్యటించిన సమయంలో తనకు చెప్పినట్లు మంత్రి చెప్పారు.

రైతుల మదిలో ఆశల పరవళ్లు

● కృష్ణా జలాల విడుదల నేపథ్యంలో హర్షం

నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం విడుదల చేయనుండటంతో ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు మొదటి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తీగలేరు కాలువ ద్వారా 62 వేల ఎకరాలు, గొట్టిపడియ కాలువ కింద 9,500 ఎకరాలకు సాగునీరు అందనుండగా.. 4 లక్షల మందికి తాగునీరు తక్షణమే అందనుంది. ఎడారిగా మారిన బీళ్లు పచ్చని పంట పొలాలుగా అలరారనున్నాయి.

–న్యూస్‌టుడే, అర్ధవీడు, కంభం

కళ్లారా చూస్తానని అనుకోలేదు



నాకు 5 ఎకరాల భూమి ఉంది. మరో 3 ఎకరాలు కౌలుకు చేస్తున్నాం. రెండు డీప్ బోర్లు వేసుకుని ఏడాదికి ఒకపైరు సాగు చేస్తున్నాం. అయితే నా చిన్నతనంలో వెలిగొండ ప్రాజెక్టుకు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. మా పొలాలు సస్యశ్యామలం అవుతాయని మా పెద్దలు అప్పుడే సంతోషపడ్డారు. నీ హయాంలో వెలిగొండ జలాలు వస్తాయని.. ఏడాదికి మూడు పైర్లు పండించుకుని బతకమనేవారు. కానీ గత పాలనలో నీళ్లు లేకుండా ప్రాజెక్టును ప్రారంభించడంతో ఇక నీళ్లు రావని అనుకున్నా.. కానీ ఇప్పుడు కళ్లారా చూస్తున్నాం. సొరంగాల ద్వారా ఆదివారం ఫీడర్ కాలువకు వదలడం చూశాం. రాబోయే రోజుల్లో ఈ నీరు మా పొలాలకు చేరుతుందని సంతోషంగా ఉంది.

–టి.శ్రీనివాసులు, రైతు, నేకునాంబాద్, బేస్తవారపేట మండలం

కాకర్ల మరో కోనసీమ కానుంది



వెలిగొండ ప్రాజెక్టు కాకర్ల ఆనకట్ట దిగువన 6 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. సకాలంలో డీప్ బోరుతో నీరందక భూగర్భజలాలు అడుగంటి పంటను కాపాడుకునేందుకు నానా కష్టాలు పడేవాళ్లం. దానికి తోడు ఫ్లోరైడ్ శాతం కూడా ఎక్కువగా ఉండటంతో పెద్దగా దిగుబడులు వచ్చేవి కాదు. అయితే ఆనకట్టకు వెలిగొండ జలాలు చేరితే మా బోర్లకు నీరు పుష్కలంగా వస్తుంది. మంచి దిగుబడులు సాధించవచ్చు. 30 ఏళ్లగా ప్రాజెక్టు పనులు ఎప్పుడు పూర్తవుతాయా అని ఎదురు చూస్తున్నాం. చివరకు పనులు పూర్తి చేసుకుని నేడు చంద్రబాబు ప్రారంభోత్సవానికి రానుండటం చాలా ఆనందంగా ఉంది. కాకర్ల మరో కోనసీమ కానుంది. –ఎం.కోటిరెడ్డి, రైతు, కాకర్ల, అర్ధవీడు మండలం

కల నెరవేరుతోంది



'నా జీవిత కాలంలో వెలిగొండ ప్రాజెక్టుకు నీరు వస్తుందనుకోలేదు. ఎన్నో ఏళ్ల ఎదురుచూపులు ఫలిస్తున్నాయి. సీఎం చంద్రబాబు కృషితోనే ఇది సాకారమవుతోంది. మా గ్రామం వద్ద రిజర్వాయర్ నిర్మించారు. దాంట్లోకి నీరు వస్తే మా ఊరితో పాటు చుట్టపక్కల గ్రామాల్లోనూ భూగర్భ జలాలు పెరుగుతాయి. దాని నుంచి మా గ్రామ చెరువుకు నీరు వస్తుంది. మాగాణి పొలంతో పాటుగా, రేగడి భూమికి సాగు జలాలు వచ్చే అవకాశం ఉంటుంది. కృష్ణా జలాలు వస్తే ఫ్లోరైడ్ సమస్య తగ్గుతుంది. మంచినీరు వస్తుంది'

– పుట్టా చిన్న సుబ్బయ్య, రైతు, తురిమెళ్ల

ఎదురుచూపు.. ఉద్వేగం.. ఆనందం

● ట్రయల్ రన్‌లో ప్రజల పరిస్థితి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు జంట సొరంగాల్లో నుంచి కృష్ణా జలాలు ఫీడర్ కాలువకు చేరడంతో అక్కడ ఉన్న ఇంజినీరింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఆనందంలో మునిగిపోయారు. వెలిగొండ ప్రాజెక్టులోకి కృష్ణా జలాలు పారించేందుకు ఆదివారం ట్రయల్ రన్ వేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కృష్ణా జలాలను చూసేందుకు ఎదురు చూశారు. నీరు రాగానే యువత కేకలు వేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. రెండో సొరంగం ముఖద్వారం, రెండు సొరంగాలు ఫీడర్ కాలువలో కలిసే ప్రదేశం, సీఎం ముఖ్యమంత్రి హారతి ఇచ్చే ప్రదేశంలో నీరు ప్రవహిస్తుంటే ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ప్రజాప్రతినిధులు, మహిళలు, చిన్నారులు ఆసక్తి చూపారు. సొరంగాల్లో నీటి ప్రవాహాన్ని చూసి మా కష్టం ఫలించిందని ఇంజినీర్లు, కార్మికులు ఒకరినొకరు చేతులు కలుపుతూ ఆనందాన్ని పంచుకున్నారు.

సీఎం పర్యటన దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపు


డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లాలో ఈ నెల 31వ తేదీన పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో నుంచి ట్రాఫిక్‌ను మళ్లించినట్లు పోలీసు అధికారులు చెప్పారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ యు.నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 31న ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వాహనాల దారి మళ్లింపు ఉంటుందన్నారు. నాలుగు మార్గాల్లో ట్రాఫిక్‌ను మార్పు చేసినట్లు తెలిపారు. నాలుగు మార్గాల్లో వాహనదారులు రాపోకలు సాగించాలని కోరారు. పోలీసు అధికారులకు సహకరించాలని డీఎస్పీ కోరారు. గుంటూరు నుంచి ఆత్మకూరు వెళ్లే వాహనదారులు గిద్దలూరు మీదుగా నంద్యాల వైపు వెళ్లి, అక్కడి నుంచి ఆత్మకూరు వెళ్లాలన్నారు. దేవరాజుగట్టు నుంచి చిన్న దోర్నాల వైపు వెళ్లే వాహనదారులకు రహదారి నిషేధించినట్లు చెప్పారు. శ్రీశైలం నుంచి వచ్చే, వెళ్లే వాహనాలు దోర్నాల టౌన్‌లోకి వెళ్లకుండా బైపాస్ రోడ్డు నుంచి రాకపోకలు జరపాలన్నారు. ఆత్మకూరు వైపు వెళ్లే వాహనదారులు గిద్దలూరు మీదుగా నంద్యాల వైపు వెళ్లి, అక్కడ నుంచి ఆత్మకూరు వైపు వెళ్లాలని సూచించారు. ఆత్మకూరు నుంచి గుంటూరు, శ్రీశైలం వైపు వెళ్లే వాహనదారులు నంద్యాల నుంచి గిద్దలూరు మీదుగా వెళ్లాలని సూచించారు.

గ్రామీణ నేపథ్యం.. ప్రతిభ జాతీయం

చదువు, క్రీడల్లో రాణించేందుకు పేదరికం అడ్డుకాదని పలువురు గ్రామీణ విద్యార్థినులు నిరూపిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపి, అటు పాఠశాలలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొస్తున్నారు. ఇటీవల ఒంగోలులో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

–న్యూస్‌టుడే, టంగుటూరు

వాలీబాల్, షూటింగ్ బాల్‌లో రాణిస్తూ...



టంగుటూరు మండలం ఆలకూరపాడు జడ్పీ పాఠశాలకు చెందిన **పి.సుచరిత** పదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ చదివిస్తున్నారు. అండర్-17 వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ఇప్పటికీ మూడు సార్లు ఆడి ఉత్తమ ప్రతిభ చూపింది. అదే విధంగా షూటింగ్ బాల్‌లోనూ రాణిస్తూ 2025లో హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది.

తండ్రి కోరిక నెరవేర్చే దిశగా..



ఆలకూరపాడు జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న **వి.వందన** వాలీబాల్, టెన్నికాయిట్ క్రీడల్లో రాణిస్తోంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో రాణించింది. అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఆడారు. టెన్నికాయిట్‌లో రాష్ట్ర స్థాయిలో పాల్గొని ప్రతిభ కనబర్చింది. తల్లిదండ్రులిద్దరూ అదే పాఠశాలలో వాచ్‌మెన్, స్వీపర్‌గా పనిచేస్తున్నారు. తండ్రి వరికూటి రాముకు క్రీడలంటే ఆసక్తి. కుమార్తెను ఎస్సైగా చూడాలనేది ఆయన కోరిక.

సివిల్సే లక్ష్యం



టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న **తేళ్ల రిషిత ప్రియ** పదో తరగతి చదువుతోంది. తల్లి దండ్రులిద్దరూ కూలీలే. అటు చదువు, ఇటు క్రీడల్లోనూ రాణిస్తూ ఆల్ రౌండర్‌గా నిలుస్తోందని వ్యాయామ ఉపాధ్యాయురాలు తెలిపారు. వాలీబాల్, షాట్‌పుట్ క్రీడల్లో ఎంతో చురుగ్గా పాల్గొంటుంది. వాలీబాల్ అండర్ -14 విభాగంలో ఇప్పటి వరకు ఐదుసార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంది. స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన షాట్‌పుట్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. సివిల్స్‌కి సన్నద్ధమై ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఘనంగా ప్రకాశం జిల్లా తెలుగు వెలుగులు సదస్సు


ప్రసంగిస్తున్న అధికార భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు త్రివిక్రమరావు

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు వినపడాలి అన్న ఆశయంతో పని చేస్తున్నామని మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూల త్రివిక్రమరావు అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో కొప్పోలు రోడ్డులోని నెక్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన 'ప్రకాశం జిల్లా తెలుగు వెలుగులు' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. బాలల కోసం ఒంగోలులో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తుండటం హర్షణీయమని పేర్కొన్నారు. పిల్లల్లో సృజనాత్మకత, వైజ్ఞానిక పరిజ్ఞానం, మూఢవిశ్వాసాలకు దూరంగా మరల్చడం, హేతువాద దృక్పథాన్ని తమ రచనలలో పొందుపరచాలని కవులను కోరారు. ప్రజల్లో చైతన్యం రావాలంటే ఆ బాధ్యత కవులు, రచయితలపైనే ఉందని, ఆ దిశగా ప్రయత్నం చేయాలన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు భాషా ఔన్నత్యాన్ని ప్రపంచ వ్యాప్తం చేయాలన్న సంకల్పంతో ప్రపంచ తెలుగు మహాసభలకు శ్రీకారం చుట్టామని, డిసెంబర్ 5న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా త్రివిక్రమరావును సత్కరించారు. వెంకట శ్రీనివాసులు, కొండారెడ్డి, మరళీధర్‌రెడ్డి, శ్రీకాంత్, రమేష్‌కృష్ణ, రమావతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆలస్యంగా అల్పాహారం

● మంత్రి ఆగ్రహం


వసతి గృహంలో కింద కూర్చుని మాట్లాడుతున్న మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో బాలికలకు ఉదయం అల్పాహారం ఆలస్యంగా పెట్టడంపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మార్కాపురం- తర్లుపాడు రోడ్డులోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా వెళ్లి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో అందుతున్న పౌష్టికాహారంతో పాటు సౌకర్యాలపై ఆరా తీశారు. కింద కూర్చుని సమస్యలను చెప్పాలని కోరారు. దీంతో విద్యార్థులు మంత్రి దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అల్పాహారం ఎందుకు ఆలస్యంగా పెట్టారని అధికారులను ప్రశ్నించారు. వసతి గృహంలో పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులతో పాటు ఇతర సామగ్రి ఇవ్వకపోవడంపై వసతి గృహ అధికారి, డీడీపై అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్, అధికారులు పాల్గొన్నారు.

పీఆర్ ఎస్ఈగా చంద్రశేఖర్

ఒంగోలు గ్రామీణం: ప్రకాశం సర్కిల్ పంచాయతీరాజ్ ఎస్ఈగా బి.చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఎస్ఈ జి.అశోక్ ఈ నెలాఖరుతో ఉద్యోగ విరమణ పొందనున్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 112, రిటైల్ లైవ్ - 139, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 243



బాలికల ఖోఖో జట్టు ఎంపిక

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో జిల్లా జూనియర్ బాలికల ఖోఖో జట్టును చీమకుర్తిలో ఆదివారం ఎంపిక చేశారు. సుమారు 60 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వసంత రఘుబాబు, కరిచేటి హనుమంతరావు, పీడీ మండవ సౌజన్య పర్యవేక్షించారు. సీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, పీడీ రామకృష్ణ, శ్రీహరి, మురళి, వెంకట్ పాల్గొన్నారు.

ప్రతిరోజు స్వర్ణ గ్రామ, వార్డుల్లో పీజీఆర్ఎస్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సోమవారం నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సదరు కార్యాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదంటూ ఐవీఆర్ఎస్ ద్వారా పలువురు అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌కు రావాల్సిన పని లేకుండా స్థానికంగానే అర్జీలు ఇవ్వడం ద్వారా వాటిని పరిష్కరిస్తారని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నీట్ పీజీ పరీక్షకు 426 మంది హాజరు


పరీక్ష కేంద్రంలోని ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకుంటున్న డీఆర్వో వెంకటరమణ

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఒంగోలులోని మూడు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఒంగోలు సమీపంలోని రైజ్ కృష్ణసాయి కళాశాల, మామిడిపాలెం జంక్షన్‌లోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థలోని కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షను నిర్వహించారు. మొత్తం 434 మంది అభ్యర్థులకు గానూ, 426 మంది హాజరయ్యారు. సదరు కేంద్రాలను డీఆర్వో పీవీ.రమణ, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్లు బ్రహ్మయ్య, కృష్ణమోహన్ పరిశీలించారు.

నేడు పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను ఈ వారం తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు యంత్రాంగం బందోబస్తు విధుల్లో నిమగ్నమై ఉండటంతో సోమవారం పీజీఆర్ఎస్‌ను రద్దు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

సాగర్ నీరొచ్చింది.. దాహార్తి తీరనుంది


85/3వ మైలు గేట్ల నుంచి జిల్లాలోకి ప్రవేశించిన సాగర్ జలాలు

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లా తాగునీటి అవసరాల కోసం విడుదలైన సాగర్ జలాలు ఆదివారం త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్‌లోకి ప్రవేశించాయి. తీవ్ర వర్షాభావంతో తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్న మార్కాపురం, ప్రకాశం జిల్లాల ప్రజల దాహార్తి తీరనుంది.

సోమవారం కల్లా కురిచేడు సబ్ డివిజన్‌లోకి

మూడు రోజుల క్రితం బుగ్గవాగు వద్ద జలాలు విడుదల చేయగా శనివారం పల్నాడు జిల్లా చేజర్ల సమీపంలోని 57/2వ మైలు వద్దకు వచ్చాయి. అక్కడ షట్టర్లు ఎత్తడంతో ఆదివారం పల్నాడు-మార్కాపురం జిల్లాల సరిహద్దు 85/3వ మైలు నుంచి జిల్లాలోకి తొలుత 475 క్యూసెక్కుల సాగర్ జలాలు ప్రవేశించాయి. సాయంత్రానికల్లా ఆరడుగుల మేర ప్రవాహం 1,500 క్యూసెక్కులకు పెరిగింది. సోమవారం కల్లా త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్ దాటి కురిచేడు సబ్ డివిజన్‌లోకి ప్రవేశిస్తాయని త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్ డివిజన్ డీఈఈ యు.విజయలక్ష్మి తెలిపారు. సాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా ఉమ్మడి జిల్లాకు రెండు వేల క్యూసెక్కుల చొప్పున 15 రోజుల పాటు సాగర్ జలాలు సరఫరా అవుతాయని ఒంగోలు ఎన్నెస్పీ ఇన్‌ఛార్జి ఎస్ఈ రవికుమర్ తెలిపారు.

అడుగంటిన తాగునీటి జలాశయాలు

కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతాల్లో అరకొర వానలు కురవడంతో వచ్చిన కొద్దిపాటి వరదకు శ్రీశైలం జలాశయం సైతం నిండలేదు. ఫలితంగా నాగార్జున సాగర్‌కు నీటి చేరిక నిలిచిపోవడంతో సాగునీటికి నోచుకోలేదు. ఖరీఫ్‌లోనూ వాన జాడ లేక, ఎండల తీవ్రత పెరగడంతో చెరువులు అడుగంటాయి. కొన్ని చెరువుల్లో 40 శాతం నీరుండగా, మరికొన్నింట్లో 25 శాతానికి మించి లేవు.

● ఎల్‌నినో తీవ్రత కొనసాగే అవకాశం ఉన్నందున రబీ సీజన్ వస్తున్నా చినుకు జాడ లేకపోవడంతో చెరువులు పూర్తిగా అడుగంటే ముప్పు ఉంది. 1.5 టీఎంసీల నీరు నిల్వ ఉండాల్సిన రామతీర్థం జలాశయంలో 0.16 నీరు ఉంది. డెడ్ స్టోరేజీకి చేరిన రామతీర్థంతో పాటు సాగర్ ప్రధాన కాలువపై ఉన్న తాగునీటి నిల్వ జలాశయాలను నీటితో నింపేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు.

గ్రాసమే బంగారమాయె

▶ ఆకాశాన్నంటిన ధరలు



ఎల్‌నినో ప్రభావంతో మేత దొరక్క పశువులు అల్లాడుతున్నాయి. దీంతో వ్యయప్రయాశలకోర్చి ఇతర జిల్లాల నుంచి తీసుకొస్తున్నారు. గతంలో ఏర్పాటుచేసుకున్న వాముల్లోని గడ్డి అయిపోవడంతో రైతన్నలకు దిక్కుతోచడం లేదు. రెండు నెలల క్రితం చిన్నపాటి గడ్డి కట్ట (రోల్) ధర రూ.వంద ఉండేదని, నేడు రూ.రెండొందల యాభైకు పెరిగిందని వాపోతున్నారు. దీంతో దొనకొండ, చందవరం, లక్ష్మీపురం, దేశిరెడ్డిపల్లి, బట్టిపాడు రైతులు భారీ ధర చెల్లించి వినుకొండ ప్రాంతం నుంచి తీసుకొస్తున్నారు. నిత్యం దాదాపు పది ట్రాక్టర్లు అక్కడి నుంచి ఆయా గ్రామాలకు వస్తున్నాయి. పాల దిగుబడితో వచ్చే డబ్బులన్నీ వరిగడ్డికే సరిపోతోందని, ఏం చేయాలో దిక్కుతోచడం లేదని వారంటున్నారు.

–న్యూస్‌టుడే, దొనకొండ

పేదలకు ఆపన్నహస్తం అందించడమే 'మానవత' లక్ష్యం


ర్యాలీలో పాల్గొన్న సేవా సంస్థ ప్రతినిధులు

పొదిలి, న్యూస్‌టుడే: సమాజంలోని పేదలకు ఆపన్నహస్తం అందించి శాంతి, ప్రేమ, ఆనందం పంచాలన్నదే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని వ్యవస్థాపకుడు ఎన్.రామచంద్రారెడ్డి అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా మానవత శాఖల ఆధ్వర్యంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ పొదిలిలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో జరిగిన జిల్లా నూతన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా మానవతా సేవా సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా 146 శాఖల ద్వారా సేవలందిస్తుందన్నారు. మానవతావాదులు, దాతలు ముందుకొచ్చి సంస్థ చేపట్టే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని చెప్పారు. పొదిలిశాఖ చేస్తున్న సేవా కార్యక్రమాలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఏపీఆర్ గ్రూప్స్ అధినేత ఆవుల క్రిష్టారెడ్డి ఈ ఏడాది 105 మంది పేదలకు ఒక్కొక్కరికీ రూ.అయిదు వేల నిత్యవసరాలను అందించడం అభినందనీయమన్నారు. జిల్లా కార్యవర్గం చేత క్రిష్టారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా ఎం.పార్థసారథి, ప్రధాన కార్యదర్శిగా ఎం.యేసోబు, కోశాధికారిగా ఎం.నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా కె.రామిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా జి.వేణు, కార్యనిర్వహణ సభ్యులుగా డి.శ్రావణ్‌కుమార్, ఎం.సత్యనారాయణ, టి.రామిరెడ్డి, కె.చెన్నకేశవులు, ఉమ్మడి ప్రకాశం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా వనజాక్షి ప్రమాణం చేశారు. పొదిలి మానవతశాఖ ఛైర్మన్ కె.నారాయణ బాబు, మాజీ అధ్యక్షుడు కె.యల్లమందారెడ్డి, కన్వీనర్ కె.సుబ్బారెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.చిరంజీవి, వెంకటకృష్ణారావు, స్థలదాత వెలిశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారి బి.అశోక్, మానవతాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గ్యాంగ్‌మెన్ దుర్మరణం

ఉలవపాడు, న్యూస్‌టుడే: రైల్వేట్రాక్‌పై పనిచేస్తున్న గ్యాంగ్ మెన్ ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందిన సంఘటన ఉలవపాడు మండలంలోని కరేడు ర్యాంపు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు ఉలవపాడులోని రిజర్వు కాలనీకి చెందిన దావులూరి భాస్కర్(28) అనే యువకుడు గత కొంతకాలంగా రైల్వేశాఖలో గ్యాంగ్ మెన్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం ఉదయాన్నే విధులకు వెళ్లాడు. కరేడు ర్యాంపు వద్ద మన్నేరు వంతెన సమీపంలో ఉన్న రైల్వేట్రాక్ మూడో లైనుపై పని చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన రైలు ఢీకొట్టింది. ప్రమాదంలో ఆయన మృతదేహం ముళ్లపొదల వద్ద పడింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

● చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి ఎన్టీఆర్‌నగర్ సమీపంలో నామ్ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన ఆత్మకూరి నాగేశ్వరరావు(76) కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. సరకుల కొనుగోలు నిమిత్తం ఆయన ద్విచక్ర వాహనంపై అద్దంకి వెళ్తుండగా ఎన్టీఆర్‌నగర్ వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్తున్న లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో చేతికి, ముఖానికి గాయాలవడంతో 108 వాహనంలో మొదట అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం. ఆయన కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలి


మాట్లాడుతున్న బీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకటరావు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను రద్దు చేయాలని బీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకటరావు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం బహుజన టీచర్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 55 ఏళ్ల వయసు దాటిన ఉపాధ్యాయులను కూడా టెట్ రాయాలని చెప్పడం ఆందోళనకు గురి చేస్తుందని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించడంతో పాటు ఐఆర్ ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డీఏలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఉద్యమం చేపట్టనున్నట్లు చెప్పారు. సమావేశంలో సంఘం నాయకులు దేవసహాయం, మాధవరావు, సువర్ణబాబు, కోటేశ్వరరావు, కిషోర్ పాల్గొన్నారు.

అద్దంకి
•అద్దంకి • దర్శి

ఆక్రమణ చెరలో అద్దంకి చెరువు

☛ తాజాగా అక్రమ నిర్మాణాలు


అద్దంకి చెరువు భూమిలో నిర్మాణాలు

అద్దంకి చెరువును యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. దీపం ఉండగానే.. ఇల్లు చక్కబెట్టుకోవాలన్న రీతిలో కొందరు స్థానికులు చెరువు పరిధిలో నిర్మాణాలు మొదలుపెట్టారు. ఇప్పటికే ఇక్కడ ఆక్రమణలపై అధికారులు శీతకన్ను వేయడంతో తాజాగా మరికొందరు బరితెగించారు. గత ప్రభుత్వ హయాంలో చెరువు గర్భాన్ని పూడ్చి గృహ నిర్మాణాలు చేశారు. విద్యుత్తు, పురపాలక అధికారులు సైతం వారికి సహకరించారని పట్టణవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత కొంతకాలంగా ఈ దందా గుట్టుచప్పుడు కాకుండా సాగింది. అమృత్ 2.0 పథకం కింద 82 ఎకరాల చెరువు బలోపేతం, సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. దీంతో ఈ ప్రాంతానికి డిమాండ్ పెరుగుతోంది. ఇదే అదనుగా ఆక్రమణదారులు పనులు చేపట్టారు. ఓవైపు చెరువు నవీకరణకు పాలకులు సిద్ధమవుతుంటే యంత్రాంగం మొద్దునిద్ర నటించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ ఏఈ నారాయణస్వామిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, అద్దంకి

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి

మేదరమెట్ల, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషిచేస్తానని కొరిశపాడు మండల అధ్యక్షుడిగా ఎన్నికైన తేళ్ల ప్రసాద్ అన్నారు. కొరిశపాడులో ఆదివారం జరిగిన ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్‌ను బలమైన శక్తిగా రూపొందించాలన్నారు. కార్యక్రమానికి తేళ్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎంఎస్పీ అధ్యక్షుడిగా పాలపర్తి సురేష్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారు మాదిగ హక్కుల కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు సొట్ట సురేంద్ర, రమేష్, ఎల్ఐసీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణశోభ

☛ గ్రామాల్లో ప్రత్యేక పూజలు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: పలు గ్రామాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణరాజువారిపాలెం గ్రామంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానంలో స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనమనమూరులో అంకమ్మతల్లి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మేదరమెట్ల గ్రామంలోని వెన్నెలకంటలో కనకదుర్గ మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో అనంతలక్ష్మీ సత్యదేవి సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ మహాలక్ష్మి, సరస్వతీ దేవి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

▶ జె.పంగులూరు: మండలంలోని కొండమూరులో వేంచేసివున్న కొండమూరమ్మ అమ్మవారి ఆలయ పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ కారంచేడు దక్షిణామూర్తి ఆధ్వర్యంలో రుత్విక బృందం శాస్త్రోక్తంగా క్రతువు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఆలయంలోని శిలలను పోలేరమ్మ అమ్మవారి ఆలయానికి మంగళ వాయిద్యాల నడుమ తరలించారు. ఈ నెల 7న ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు వేద పండితులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కొండమూరి శివయ్య శర్మ, శివాలయం శ్రీనివాస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

▶ తాళ్లూరు: తాళ్లూరు మండలం సోమవరప్పాడు పరిధి గుంటిగంగలో కొలువైన గంగాభవాని అమ్మవారిని ఆదివారం విశేషాలంకరణ చేశారు. ప్రస్తుతం శుభకరమైన శ్రావణమాసాన్ని పురస్కరించుకొని వేదపఠనంతో పూజారులు ప్రాకారంగా, విజయలక్ష్మి, బాలరాజు, కామేశ్వరరావు మనంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా గాజుల మాలలతో ముస్తాబు చేశారు. ప్రకాశం పరసర జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దలు, ఆర్పి ప్రసాద్, సిబ్బంది కలసి ఉత్సవాలను పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో అంకమ్మ తల్లి


జె.పంగులూరు : కొండమూరమ్మకు పూజలు


గుంటిగంగలో బోనాలతో భక్తులు

పథకం పడక.. నీరందక కలత

☛ గ్రామాల్లో దాహం కేకలు

పరిశీలన

న్యూస్‌టుడే, దర్శి :

అధికారుల నిర్లక్ష్యం, గుత్తేదారు చేతులెత్తేయడం, చోద్యం చూస్తున్న నాయకా గణం .. వెరసి దర్శి నియోజకవర్గ పరిధిలో నీటి సరఫరా నిలిచిపోయింది. వేసవిలో సైతం ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించిన ఎన్ఏపీ నీటి పథకం నుంచి గత రెండు నెలలుగా సక్రమంగా నీరందకపోవడంతో స్థానికులు దాహార్తితో అలమటిస్తున్నారు. దర్శి పట్టణం, దర్శి మండలంలోని పది గ్రామాలు, కురిచేడు మండలం, తాళ్లూరు మండలంలోని పలు గ్రామాలు, పొదిలి పట్టణానికి పూర్తిగా ఆగిపోయింది. అయిదు నెలల నుంచి వేతనాలు అందక సిబ్బంది తరచూ ఆందోళనలు చేపడుతున్నారు. గత మూడు రోజులుగా సిబ్బంది విధులకు రాకపోవడంతో చుక్కనీరు అందడం లేదు. ఎస్ఈ స్పందించి సిబ్బంది, అధికారులతో మాట్లాడినా సమస్య పరిష్కారం కాలేదు.

నిర్వహణకు ఏడాదికి రూ.3 కోట్లు..

తాగునీటి సరఫరా నిర్వహణకు ఏడాదికి సుమారు రూ.3 కోట్లు వెచ్చిస్తోంది. ఈ నిధులను మరమ్మతులతో పాటు సిబ్బంది వేతనాలకు వినియోగిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సాగర్ కాలువ నుంచి వస్తున్న నీటినే నేరుగా ప్రజలకు అందిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం బ్లీచింగ్ కూడా కలపడం లేదని వారంటున్నారు. నాలుగు నెలల క్రితం వేతనాలు చెల్లించాలని సిబ్బంది ధర్నా చేయగా, ప్రజాప్రతినిధులు, అధికారుల జోక్యం చేసుకుని గుత్తేదారుడిని ఒప్పించి రెండు నెలల జీతాలు చెల్లించేలా చేశారు. ఆ తర్వాత గుత్తేదారు తనవల్ల కాదంటూ చేతులెత్తేయడంతో సరఫరా నిలిచిపోయింది. నీటి పథకాల్లో వంద మందికి పైగా సిబ్బంది అవసరం కాగా, 70 మంది మాత్రమే విధులు నిర్వర్తించేవారు. ఎన్ఏపీ పథకానికి ఏర్పాటుచేసిన శాండ్ ఫిల్టర్లు ఎప్పుడో నాలుగు దశాబ్దాల క్రితం నాటివి కావడంతో అవి పాడయ్యాయి. ఆ తర్వాత ఒక్కొక్కటి రూ.30 లక్షల వ్యయంతో రెండు రాపిడ్ శాండ్ ఫిల్టర్లు తాత్కాలికంగా ఏర్పాటు చేయగా, అవి అంత ప్రభావవంతంగా పనిచేయడం లేదు. దీంతో దుర్వాసన, మట్టితో కూడిన నీరే దిక్కవుతోంది. దీనిపై సంబంధిత అధికారులను సంప్రదించగా వారు స్పందించలేదు.


దర్శి : వీధి కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు


ఎన్ఏపీ పథకం వద్ద దెబ్బతిన్న మోటారుకు మరమ్మతులు

తాత్కాలికంగానే విరమణ..

దర్శి : నేతలు, అధికారులు ఇచ్చిన హామీతో ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి ఆదివారం గుత్తేదారు, కార్మికులతో మాట్లాడారు. అంతకుముందు సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు దర్శికి వచ్చి కార్మికులతో భరోసా ఇవ్వడంతో ఆదివారం తాత్కాలికంగా ఆందోళన విరమించి నీటి సరఫరా పునరుద్ధరించారు. రెండురోజుల్లోగా హామీలు నెరవేర్చకుంటే సమ్మెబాట పడతామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

అద్దంకి : 94409 15704
దర్శి : 98486 71678
మేదరమెట్ల : 79933 00506

దొనకొండ, న్యూస్‌టుడే: ?: దొనకొండలోని శివాజీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం ముందు మురుగు నీరు నిలిచిపోతోంది. దీంతో చిన్నారులతో పాటు స్థానికులు రోగాల బారిన పడే ప్రమాదముంది. – ప్రసాద్, శివాజీనగర్

✓: రెండు రోజుల్లో మురుగును తొలగించి మట్టి తోలించి బ్లీచింగ్ చల్లిస్తా. – శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి

అద్దంకి, న్యూస్‌టుడే : ?: అద్దంకి పురపాలక సంఘంలోని భారీ రక్షిత మంచినీటి పథకానికి అనుసంధానిస్తూ మూడు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. వాటికి కనెక్షన్ ఇచ్చి, నీటి సరఫరా చేయాలి. మంచినీటి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. –బాలు, మాజీ కౌన్సిలర్, అద్దంకి

✓: వెంటనే జూనియర్ కళాశాల ఆవరణలోని ట్యాంక్‌కు కనెక్షన్ ఇస్తాం. స్థానికులకు నీటి ఇబ్బందులు లేకుండా చేస్తాం. –జి.లోకేష్, ఏఈ, అద్దంకి పురపాలక సంఘం

కురిచేడు, న్యూస్‌టుడే: ?: మండలంలోని కురిచేడు పంచాయతీలోని పేరుంబొట్లపాలెం, కాటంవారిపల్లె గ్రామాల్లో పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో వీధుల్లో రాకపోకలు సాగించాలంటే చిన్నారులు, మహిళలు చీకట్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీపాలు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలి.– నాగిరెడ్డి, స్థానికుడు

✓: గ్రామాల్లో వీధి దీపాలు ఎక్కడెక్కడ లేవో పరిశీలించి రెండు రోజుల్లో ఏర్పాటు చేయిస్తా. – ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి

కొప్పరం (సంతమాగులూరు), న్యూస్‌టుడే: ?: కొప్పరంలోని గిరిజన కాలనీలో నాలుగు చోట్ల వీధి దీపాలు వెలగటం లేదు. దీంతో గత కొంతకాలంగా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాం. మహిళలు, పిల్లలు రాత్రివేళ బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలి. – స్థానికులు, కొప్పరం.

✓: గ్రామంలో పరిస్థితిని పరిశీలిస్తాం. వెలగని వీధి దీపాలు దెబ్బతిన్నచోట మరమ్మతులు చేపడతాం. అవసరమున్నచోట కొత్తవాటిని బిగిస్తాం. –పున్నారావు, పంచాయతీ కార్యదర్శి, కొప్పరం.

బూదవాడ బడికి దాత చేయూత

▶ కంప్యూటర్ల అందజేతకు ఏర్పాట్లు


డీఈవో రేణుకతో ఉపాధ్యాయబృందం

జె.పంగులూరు, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయిలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించేందుకు బూదవాడ పాఠశాలకు ల్యాప్‌ట్యాప్‌లు అందజేయడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.డి.వి. ప్రసాద్ అన్నారు. బూదవాడ జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ఈమని అనంతారెడ్డి తన తండ్రి బలరామిరెడ్డి జ్ఞాపకార్థం రూ.8 లక్షల విలువైన 15 ల్యాప్‌ట్యాప్‌లను పాఠశాలకు సోమవారం అందజేయనున్నారు. దాత తన సొంత ఖర్చులతో వాలంటీర్‌ను నియమించి కంప్యూటర్ విద్యను అందించేందుకు ముందుకొచ్చారన్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ల్యాప్‌ట్యాప్‌ల బహూకరణ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా డీఈవో రేణుకను ఆహ్వానించగా, ఆమె సుముఖత వ్యక్తం చేశారని పాఠశాల హెచ్‌ఎం తెలిపారు.

వెలిగొండకు పల్లెవెలుగులు

అద్దంకి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం మార్కాపురం జిల్లాలో వెలిగొండ ప్రారంభోత్సవానికి రానున్నారు. ఈ నేపథ్యంలో అద్దంకి ఆర్టీసీ డిపో నుంచి 30 పల్లెవెలుగు బస్సుల్ని కేటాయించడంతో అక్కడికి తరలివెళుతున్నాయని మేనేజరు మహబూబీ తెలిపారు. సోమవారం సాయంత్రానికి బస్సులన్నీ యధావిధిగా డిపోకు చేరతాయన్నారు. ఒంగోలు, పొదిలి, నరసరావుపేట, వినుకొండ, విజయవాడ, శ్రీశైలం, హైదరాబాద్ రూట్‌లలో ఎక్స్‌ప్రెస్ బస్సులు యధావిధిగా నడుస్తున్నాయన్నారు. సోమవారం మాత్రమే ప్రయాణికులకు స్వల్ప అసౌకర్యం కలుగుతుందని, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించారు.

గంగదొనకొండంత నిర్లక్ష్యం

కురిచేడు మండలంలోని గంగదొనకొండలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామంలోని పలు వీధుల్లో నివాసాల నుంచి వచ్చే మురుగు నీరు నెలల తరబడి డ్రైనేజీల్లోనే నిలిచిపోతోంది. పూడిక తీయకపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. దోమల బెడదతో స్థానిక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి, తక్షణమే డ్రైనేజీ కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కురిచేడు





ట్రాఫిక్‌కు సెలవు లేదే !

సెలవు రోజుల్లోనూ ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదని అద్దంకి పట్టణవాసులు పెదవి విరుస్తున్నారు. నామ్ రహదారిపై ఆదివారం తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పరుగులు తీశాయి. మూడు రోజులుగా సెలవులైనందున స్వగ్రామాలకు వచ్చిన వారు తిరిగి హైదరాబాద్, ఇతర నగరాలకు పయనమవ్వడంతో ఆదివారం ఉదయం ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. సీఐ సుబ్బరాజు, పోలీస్ కానిస్టేబుళ్లు విధులు నిర్వహించాల్సి వచ్చింది. ఇదే సమయంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అద్దంకి మీదుగా మార్కాపురానికి వెళ్లారు. దీంతో సిబ్బంది ఉరుకులు పరుగులు తీశారు. - న్యూస్‌టుడే, అద్దంకి

ఎల్‌నినో వెంటాడినా.. సాగు బాటలో..

ఎల్‌నినో వెంటాడుతున్నా..రైతన్నలు సాగుకు ఉపక్రమించారు. తీవ్ర భిన్నభావ పరిస్థితులు నెలకొన్నా..తమకున్న పొలంలో బోర్లు, బావుల నీటి సౌకర్యంతో వరి సాగు చేస్తున్నారు. చినుకు రాలకపోయినా..పుడమిని నమ్ముకున్న కర్షకులు నాట్లు వేస్తున్నారు. నీటిని పొదుపుగా వాడుకుంటూ మంచి దిగుబడులు సాధిస్తామని వారన్నారు. బల్లికురవ, న్యూస్‌టుడే


కొండాయపాలెంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

కాలువలపై వారధుల నిర్మాణం


రామాంజనేయపురం సమీపంలో..

బల్లికురవ, న్యూస్‌టుడే: కీలకమైన వంతెనల నిర్మాణ పనులు మొదలయ్యాయి. ముక్తేశ్వరం - రామాంజనేయపురం గ్రామాల మధ్య ముక్తేశ్వరం మేజర్ కాలువపై రెండు వంతెనలు శిథిలావస్థకు చేరి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీనిపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమవ్వగా స్పందించిన విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిధులు మంజూరు చేయించారు. ఇటీవల యుద్ధప్రాతిపదికన రెండు వంతెనల నిర్మాణ పనులకు గుత్తేదారులు శ్రీకారం చుట్టారు. ముక్తేశ్వరం - బుసావారాపాలెం మధ్య వారధి నిర్మాణ దశలో ఉండగా, రామాంజనేయపురం సమీపంలో పనులు మరో రెండు రోజుల్లో ప్రారంభించనున్నట్లు గుత్తేదారు తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. దీంతో ఆయా గ్రామాల వారి కష్టాలు త్వరలో గట్టెక్కనున్నాయి.

ఈనాడు కథనాలకు స్పందన


ముక్తేశ్వరం- బుసావారిపాలెం మధ్య వంతెన నిర్మాణం

భగవద్గీత శ్లోకాలను దోష రహితంగా పఠించండి


బాలవిహార్ శిక్షణ తరగతులకు హాజరైన చిన్నారులతో నిర్వాహకులు

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో భక్తియోగంపై త్వరలో జరగనున్న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయం సాధించేందుకు కృషి చేయాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి పేర్కొన్నారు. ఆదివారం శ్రీగిరి గోశాల భవన్‌లో వేంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బాలవిహార్ శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను దోష రహితంగా నేర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు గౌరమ్మ, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సెప్టెంబర్ 4వ తేదీ ఉదయం శ్రీగిరిలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇందులో పాల్గొనదలచిన మహిళలు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సంతనూతలపాడు పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐ ఎం.శేషగిరిరావులు ఆదివారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన వంకాయలపాటి మహేష్ అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన మంగమూరి నాగూర్‌వలి కులం పేరుతో తిట్టి, దాడి చేశారన్నారు. దీనిపై మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై డీఎస్పీ, సీఐలు విచారణ చేపట్టారు. వివాదం ఎలా జరిగింది, ఎందుకు జరిగిందనే విషయాలపై పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఏఎస్సై హనుమంతరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని జమ్మలమడక సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మేదరమెట్ల గ్రామానికి చెందిన కోటిలింగం ద్విచక్ర వాహనంపై జమ్మలమడక వైపు నుంచి అద్దంకికి వెళుతున్నారు. ఈ క్రమంలో జమ్మలమడక వద్ద వాహనం అదుపు తప్పి పడటంతో గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముప్పు ముంగిట కాజ్‌వే

☛ భారీ వాహనం వెళితే అంతే సంగతులు

తాళ్లూరు, న్యూస్‌టుడే :

తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెం సమీపాన కరవది మేజరు సాగరు ప్రధాన కాలువపై నిర్మించిన కాజ్‌వే పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎన్నెస్పీ ప్రాజెక్టు ఏర్పాటుచేసిన సమయంలో నాలుగున్నర దశాబ్దాల క్రితం కాలువపై రైతుల రాకపోకలకు వీలుగా దీన్ని నిర్మించారు. కాలువకు ఆవలివైపున కొండపై వెలసిన వీర నరసింహ స్వామి దేవాలయానికి ఈ మార్గం నుంచే వెళుతుంటారు. ఏటా సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామస్థులు భారీ విద్యుత్తు ప్రభలను కాజ్‌వే నుంచే తరలిస్తుంటారు. నిత్యం వందల సంఖ్యలో రైతులు పొలాలకు వెళుతుంటారు. దీంతో వాహనాల తాకిడి అధికంగా ఉంటోంది. పంట ఉత్పత్తులను బిక్కుబిక్కుమంటూ తరలించాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎక్కడికక్కడే కూలిపోయి..

ప్రస్తుతం కాజ్‌వే పూర్తిగా శిథిలస్థితికి చేరింది. గోడలు దెబ్బతిన్నాయి. నిర్మాణానికి వినియోగించిన సిమెంటు రాలిపోయింది. భారీ వాహనం వెళితే కుప్పకూలే ప్రమాదముంది. భారీ బత్తాయి లోడు లారీలు ఈ మార్గంలో వెళుతున్నాయని, కూలిపోతే రాకపోకలు నిలిచిపోయే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎన్నెస్పీ ఏఈ కిరణ్‌ను సంప్రదించగా త్వరలోనే పరిశీలించి తగు చర్యలు చేపడతామన్నారు.


నాగంబొట్లపాలెం వద్ద శిథిలావస్థకు చేరిన కాజ్‌వే


దెబ్బతిన్న గోడలు

రోడ్డు వెంటే చెత్త.. సంపద సృష్టి ఎట్లా!

☛ నీరుగారిన బృహత్తర లక్ష్యం

న్యూస్‌టుడే, బల్లికురవ :

అద్దంకి నియోజకవర్గవ్యాప్తంగా ఏర్పాటుచేసిన చెత్త సంపద కేంద్రాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. బృహత్తర లక్ష్యంతో వీటిని నెలకొల్పగా..ఎక్కడా వినియోగంలో లేకపోవడం ఆవేదన కలిగిస్తోంది.

చెత్త నుంచి సంపద సృష్టించి తద్వారా గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటు చేసింది. అయితే నిర్వహణ విస్మరించడంతో ఎవరికీ ప్రయోజనం చేకూరడం లేదు. బల్లికురవ మండలంలో మొత్తం 15 చెత్త సంపద కేంద్రాలున్నాయి. అయితే ఏ గ్రామంలోనూ పేరుకున్న చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు చేర్చడం లేదు. చాలాచోట్ల గ్రామ పరిసరాల్లో, వాగులు, చెరువులు, రహదారుల వెంబడి పడేస్తున్నారు. అనంతరం నిప్పు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీనివల్ల కాలుష్య సమస్య ఎదురవుతోంది. ఆయా మార్గాల్లో ప్రయాణించే ద్విచక్ర వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన కేంద్రాలు వృథాగా దర్శనమిస్తున్నాయి. గ్రామాలకు దూరంగా నిర్మించడం వల్ల అసలు లక్ష్యం నెరవేరడం లేదు. అంబడిపూడి గ్రామ సమీపంలోని చెత్త సంపద కేంద్రం గోడలు పగిలిపోయాయి. బల్లికురవ చెరువు సమీపంలో రోడ్డు అంచున వ్యర్థాలు పడేస్తున్నారు. గాలి వీచినప్పుడు చెత్త అంతా రహదారిపైకి ఎగిరిపడుతోంది. దీంతో తరచూ దుర్ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. బల్లికురవ - నక్కబొక్కలపాడు మధ్య కల్వర్టు పక్కనున్న వాగు కూడా చెత్తతో నిండిపోయింది. ఈ సమస్యపై ఈవోఆర్డీ సుమతిని వివరణ కోరగా..కేంద్రాలను త్వరలో వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు.


బల్లికురవలో చెరువు సమీపంలో రోడ్డుపైనే చెత్త


సంపద కేంద్రానికి పగుళ్లు

వర్షాలు కురవాలని పోలేరమ్మకు పొంగళ్లు


పేరాయపాలెంలో పొంగళ్లు తీసుకెళుతున్న గ్రామస్థులు

పేరాయపాలెం (అద్దంకి), న్యూస్‌టుడే : వర్షాలు కురవాలంటూ మండలంలోని పేరాయపాలెం వాసులు పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. ఆదివారం ఉదయం స్థానికులంతా కలిసి అమ్మవారి ఆలయంలో జలాభిషేకం చేశారు. సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు. మహిళలంతా పొంగళ్లతో తరలివెళ్లి అమ్మవారికి సమర్పించారు. సకాలంలో వర్షాలు కురవాలని, పాడిపంటలతో గ్రామాలు కళకళలాడాలని మొక్కారు. అమ్మవారికి కట్టిన ప్రభ ఆకట్టుకుంది.

▶ ముండ్లమూరు: ముండ్లమూరు, మారెళ్ల గ్రామాల్లో కొలువుదీరిన పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు నగేష్, ప్రసాదు, సేవకులు సుబ్బారావు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పొంగించి పూలు పండ్లు పసుపు, కుంకుమ, నైవేద్యంగా సమర్పించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. బొప్పూడివారిపాలెం, కెల్లంపల్లి, నూజెళ్లపల్లి, పూరిమెట్ల ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.


ముండ్లమూరు : పోలేరమ్మతల్లి

కందుకూరు

• కందుకూరు • కొండపి

ఆబాలగోపాలం.. ఆనందమయం

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: వచ్చే నెల 4న కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని సంస్కార భారతి ఆధ్వర్యంలో బాలగోకులం కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక అంజయ్య రోడ్డులోని ఏకేవీకే కళాశాల ఆవరణలో నిర్వహించారు. విద్యార్థులకు వర్ణచిత్ర, శ్రీకృష్ణుడు, రాధ వేషధారణ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వర్ణ చిత్ర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ సృజనకు పదును పెట్టారు. శ్రీకృష్ణుడు బాల్య ఘట్టాలు, గోకులం వాతావరణం, భారతీయ సంస్కృతి, సంప్రదాయ విలువలను ప్రతిబింబించేలా చిన్నారుల ప్రదర్శనలు సాగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పిల్లల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు సృజనాత్మకతను ప్రోత్సహించడమే బాలగోకులం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

పొదిలి: మానవతా సంస్థ పొదిలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నిత్యావసరాలు, ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన ముగ్గురు కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 వేల విలువైన సరకులు అందజేశారు. అనారోగ్యంతో చనిపోయిన గురజాల చిన్న నరసయ్య కుటుంబ సభ్యులకు రూ.10 వేలు, చీకటి వెంకటయ్య కుటుంబ సభ్యులకు రూ. ఐదువేలు ఆర్థికసాయం అందించారు. దాతలు ఆవుల క్రిష్టారెడ్డి, మానవతా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

కందుకూరు: 70939 81624
కొండపి: 96424 56296

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని కేసరిగుంటకాలనీలో కాలువలు శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయింది. –ఎ.కృష్ణారావు, కేసరిగుంటకాలనీ
✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయిస్తాం. –కె.అనూష, మున్సిపల్ కమిషనర్

లింగసముద్రం, న్యూస్‌టుడే : ?: లింగసముద్రం ట్యాంకు నుంచి సరఫరా అవుతున్న తాగునీరు దుర్వాసన వస్తోంది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం.– మహేష్, స్థానికుడు
✓: ట్యాంకు శుభ్రం చేయించి నీరు వాసన రాకుండా చర్యలు తీసుకుంటాం.–మాధవరావు, పంచాయతీ కార్యదర్శి

మర్రిపూడి, న్యూస్‌టుడే: ?: మండలంలోని గుండ్లసముద్రం పంచాయతీ ఎస్టీ రాజుపాలెంలో వీధి దీపాలు వెలగక పోవడంతో రాత్రి పూట చీకట్లో తిరగాల్సి వస్తోంది. –వెంకటేశ్వర్లు, స్థానికుడు
✓:మెకానిక్‌ను పంపి మరమ్మతులు చేయిస్తాం. –దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే
?: సింగరాయకొండ హనుమాన్‌నగర్‌లో నెల రోజులుగా కాలువలు శుభ్రం చేయక పోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి మురుగు పారుదల కాక దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. –కోటేశ్వరరావు, స్థానికుడు
✓:పారిశుద్ధ్య కార్మికులతో పిచ్చి మొక్కలు తొలగించి సమస్య పరిష్కరిస్తాం.–శారద, ఈవోపీఆర్డీ
?: సోమరాజుపల్లి గ్రామ పరిధిలోని ఫకీర్‌పాలెం, సాయినగర్‌లో రాత్రి పగలు తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. – శ్రీనివాసరావు, స్థానికుడు
✓: వెంటనే స్విచ్‌లు అమర్చి సమస్య పరిష్కరిస్తాం.–శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి

గుడ్లూరు, న్యూస్‌టుడే : ?:మండలంలోని మోచర్ల పడమర వీధిలో దీపాలు వెలగడం లేదు. –ఎస్.మనికంఠ, స్థానికుడు
✓: పరిశీలించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. –మార్టిన్, పంచాయతీ కార్యదర్శి

ఉలవపాడు, న్యూస్‌టుడే: ?: ఉలవపాడులోని హైస్కూల్ సంఘం చివరి వీధి వద్ద మురుగు కాలువలో పూడిక చేరి దుర్వాసన వస్తోంది. దీంతో చుట్టుపక్కల వారు ఇబ్బందులు పడుతున్నారు.–శ్రీను, ఉలవపాడు
✓: రెండ్రోజుల్లో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లిస్తాం.–వీరయ్య, పంచాయతీ కార్యదర్శి

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: ?: వలేటివారిపాలెం పీహెచ్‌సీ వెనుక వైపు ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. రక్షితనీటి పైపును అనుసంధానం చేయకపోవడంతో నిరుపయోగంగా ఉంది. –సుబ్బారావు, స్థానికుడు
✓:త్వరలోనే అనుసంధానం చేసి వినియోగంలోకి తెస్తాం. –రాజశేఖర్, ఇన్‌ఛార్జి జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: ?:మండలంలోని పెట్లూరులో మురుగు సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా కుడుతున్నాయి. –సుబ్బారావు స్థానికుడు
✓:సిబ్బందిని ఏర్పాటు చేసి పిచికారీ చేయిస్తాం. –కిశోర్ ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి

భక్తిశ్రద్ధలతో విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం


ఆలయం వద్ద భక్తుల సందడి


ముత్యాలమ్మ పరమేశ్వరి అమ్మవారు

మర్రిపూడి, న్యూస్‌టుడే: మండల కేంద్రం మర్రిపూడి బస్టాండు కూడలిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం ముత్యాలమ్మ పరమేశ్వరి అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

ఘనంగా గ్రామ దేవతల తిరునాళ్ల

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని స్వర్ణాజిపురం, గుడ్లూరులో గ్రామదేవతల తిరునాళ్లు సందడిగా సాగుతున్నాయి. స్వర్ణాజిపురంలో పోలేరమ్మ ఆలయం వద్ద ఆదివారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజు విగ్రహానికి మొక్కారు. పాడిపంటలతో గ్రామాన్ని చల్లగా చూడాలంటూ వేడుకున్నారు. గుడ్లూరు మిట్టపాలెంలో నాగార్పమ్మ తిరునాళ్ల నిర్వహించారు. జలాధివాసంలో ఉన్న అమ్మవారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.


పోలేరమ్మ చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

చుక్క చేరక.. దిక్కుతోచక

కందుకూరు పట్టణం, లింగసముద్రం, న్యూస్‌టుడే:

నియోజకవర్గంలో దాదాపు 100కు పైగా గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రధాన నీటి వనరుగా ఉన్న రాళ్లపాడు జలాశయం రోజురోజుకి అడుగంటుతోంది. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా జలాశయానికి చుక్క నీరు వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీరు రంగు మారి పచ్చగా వస్తోంది. దీంతో ప్రజలు వాడకానికి కూడా వినియోగించుకోలేకపోతున్నారు.


రాళ్లపాడులో అడుగంటిన నీరు

ఆరు అడుగులే నిల్వ

గత నాలుగు నెలలుగా రాళ్లపాడు ప్రాజెక్టులోకి చుక్క నీరు చేరలేదు. ఎగువన ఉన్న సోమశిల ప్రాజెక్టులోనూ లేకపోవడంతో.. ఉత్తర కాలువ ద్వారా రావాల్సిన 1.5 టీఎంసీ నీరు ఇంత వరకు చేరలేదు. గతేడాది కురిసిన వర్షాలకు చేరిన జలమే ఇప్పటికీ దిక్కయ్యింది. ప్రస్తుతం జలాశయంలో 6 అడుగుల మేర నిల్వ ఉంది. దీన్ని రాళ్లపాడు-రోళ్లపాడు, గుడ్లూరు ఫేజ్-1, 2 సీపీడబ్ల్యూ పథకాలకు వినియోగించాల్సి ఉంది. వీటి వద్ద ఏర్పాటు చేసిన ఫిల్టరేషన్ కేంద్రాలకు అడుగంటిన నీరు వస్తుండటంతో.. ఎంత శుద్ధి చేసినా ప్రయోజనం లేకుండని అధికారులు చెబుతున్నారు. రంగు మారి పచ్చగా వస్తున్నాయి. ఆ నీటినే ఆర్ ఆర్ పథకం ద్వారా లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లోని 24 గ్రామాల ప్రజలకు ఇస్తున్నారు. గుడ్లూరు మంచినీటి పథకాల ద్వారా 30 గ్రామాలకు పైగా ఇవే నీరు దిక్కవుతోంది. గుడ్లూరులో మూడు రోజులకు, ఉలవపాడులో రెండు రోజులకోసారి నీటి సరఫరా జరుగుతోంది. వలేటివారిపాలెం మండలం కాకుటూరు, చెర్లోపాలెం, పోలినేనిచెరువు గ్రామాలకు ఆ ఊసే లేదు.

ఆర్వో ప్లాంట్లే దిక్కు

నియోజకవర్గంలోని నీటి వనరులన్నీ అడుగంటుతున్నాయి. ఇప్పట్లో వర్షాలు పడే సూచనలు కూడా కనిపించడం లేదు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తీవ్రమయ్యే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం సీపీడబ్ల్యూ పథకాల ద్వారా సరఫరా చేస్తున్న నీరు రంగు మారి వస్తుండటంతో ప్రజలు తాగలేకపోతున్నారు. గ్రామాల్లో ఉన్న ఆర్వో ప్లాంట్ల నీటిని కొనుగోలు చేసి గొంతు తడుపుకొంటున్నారు. లింగసముద్రం మండలం జంపాలవారిపాలెం వద్ద పైపు లీకై రోజులు గడుస్తున్నా.. మరమ్మతులు చేయలేదు. సమస్య తీవ్రమయ్యేలోపే ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎండిన కుంట.. మూగజీవాలకు తంటా



వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలోని బొంతవారిపాలెంలోని బత్తిని వారి కుంట ఎండిపోయింది. అందులో నీరు లేని సమయంలో పశువుల దాహార్తి తీర్చేందుకు వాటర్‌షెడ్ పథకంలో తొట్టె నిర్మించారు. గతంలో సమస్య తలెత్తిన సమయంలో దీన్ని వినియోగించగా. . ప్రస్తుతం నీరు నింపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా పశువులు, సన్న జీవాలకు తాగునీరు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పశుపోషకులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తొట్టెలో నీటిని నింపాలని కోరుతున్నారు.

ఆనంద విహారం.. భద్రతే ప్రామాణికం



సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ మండలం పాకల సముద్ర తీరానికి ఆదివారం సందర్శకులు తరలివచ్చారు. సెలవు దినం కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వ్యాపారులు, ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో వచ్చి సేదతీరారు. సముద్ర స్నానాలు ఆచరిస్తూ తీరంలో కేరింతలతో సందడి చేశారు. చిన్నారులు ఇసుక తిన్నెల్లో ఆటలాడారు. మరోవైపు గ్రామ దేవతల కొలుపుల సందర్భంగా కొండపి, కందుకూరు, కనిగిరి తదితర ప్రాంతాల నుంచి భక్తులు సముద్ర స్నానాలు చేసేందుకు తరలివచ్చారు. మెరైన్ ఎస్సై ఈశ్వరయ్య సిబ్బందితో కలిసి బందోబస్తు పర్యవేక్షించారు. భద్రతా చర్యలను సూచిస్తూ అప్రమత్తం చేశారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి


కరపత్రం అందజేస్తున్న పున్నయ్య చౌదరి తదితరులు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని తెదేపా నాయకుడు గోనుగుంట పున్నయ్య చౌదరి అన్నారు. మండలంలోని నేతివారిపాలెం గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల వివరాలతో రూపొందించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి, వివరించారు. కార్యక్రమంలో నాయకులు మన్నెం శ్రీనివాసరావు, ముల్లపూడి వెంకయ్య, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యలో తెలుగు మాధ్యమం తప్పనిసరి


బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక విద్య తప్పనిసరిగా తెలుగు మాధ్యమంలోనే బోధించాలని, ఇంటర్, డిగ్రీలో ద్వితీయ భాషగా చేయాలని తెలుగు భాషా ఉపాధ్యాయుడు, శ్రీఅన్నమయ్య సంగీత సాహిత్య వేదిక ప్రతినిధి ఇనకొల్లు మస్తానయ్య అన్నారు. గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో శ్రీవారి సేవా సమితి అనుబంధ సంస్థ అయిన శ్రీఅన్నమయ్య సంగీత, సాహిత్య వేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గతేడాది తెలుగులో వంద మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సాహక బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో జీవీ శేషగిరిరావు, జి.వెంకటస్వామి, ఏవీఆర్ మూర్తి, సీహెచ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో వేరుసెనగ రైతు


కాయలను శుభ్రం చేస్తున్న కర్షకుడు

కందుకూరు, ఉలవపాడు, గుడ్లూరు, న్యూస్‌టుడే:

ఈ ఏడాది వేరుసెనగ సాగు రైతులకు లాభాలు తెచ్చిపెట్టింది. పంట వేసింది తక్కువ విస్తీర్ణంలో అయినా మంచి దిగుబడి, ధర దక్కుతుండటంతో కర్షకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు నియోజకవర్గంలోని గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లో బోర్ల కింద సుమారు 1500 ఎకరాల్లో సాగు చేశారు. ఉలవపాడు మండలంలో తుంపర సేద్యంతో పంటను కాపాడుకున్నారు. 20 రోజుల నుంచి పంటతీసే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఇప్పుడిప్పుడే అమ్మకాలు ప్రారంభమయ్యాయి.

30 బస్తాల దిగుబడి: ఎకరాకు సుమారు 35 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తోంది. 40 కిలోల బస్తా రూ.4000 వరకు కొనుగోలు చేస్తున్నట్లు పొజర్ల రైతులు తెలిపారు. పెట్టుబడి రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు అవుతోంది. ఖర్చులు పోనూ రూ.40వేల నుంచి రూ.50వేల వరకు మిగులుతోంది. సాగు ఖర్చు ఎక్కువగా ఉండే ఉలవపాడు మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో సైతం సాగు లాభదాయకంగా ఉందంటున్నారు.

రెండో పంటగా.. : రెండో పంటగా వేరుసెనగ సాగుకు కొందరు రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. మరోవైపు భూమిలో నత్రజని శాతం పెరుగుతుందని, ఈ కారణంగా తరువాత సాగుచేసే వరి పంటకు భూమి సారవంతమవుతుందని చెబుతున్నారు. రసాయన ఎరువుల వాడకం సైతం తగ్గుతుందని గుడ్లూరుకు చెందిన రైతు మల్లికార్జున తెలిపారు.

భగవద్గీత శ్లోకాలు దోష రహితంగా పఠించండి

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో భక్తియోగంపై త్వరలో జరగనున్న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయం సాధించేందుకు కృషి చేయాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి పేర్కొన్నారు. ఆదివారం శ్రీగిరి గోశాల భవన్‌లో వేంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బాలవిహార్ శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను దోష రహితంగా నేర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు గౌరమ్మ, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పరివర్తకం



చేతికందే ఎత్తులో ఉన్న ఈ విద్యుత్తు నియంత్రిక పొదిలి మార్గంలో కొండపి కల్యాణ మండపం ఎదుట కనిపిస్తోంది. చుట్టూ రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో ప్రమాదకరంగా కనిపిస్తోందని రాకపోకలు చేసే స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేత నిమిత్తం పశువులు సైతం ఆ ప్రాంతంలోకి వెళుతుంటాయి. ఎత్తు పెంచి, చుట్టూ రక్షణ ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని విద్యుత్తు లైన్‌మ్యాన్ రమేశ్ తెలిపారు.
– న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

ఆలయ దారి.. మడుగులా మారి

మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్డుపై మోకాలి లోతున నీరు నిల్వ ఉంటోంది. ఈ కారణంగా రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ప్రతి ఆదివారం దత్తాత్రేయస్వామి ఆలయానికి వెళ్లే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, లింగసముద్రం



చెరువు మట్టి.. కొల్లగొట్టి



మండలంలోని బిట్రగుంట చెరువు మట్టి అక్రమంగా తరలుతోంది. జేసీబీతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా భారీ ఎత్తున తరలిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. విషయం అధికారులకు తెలిసినప్పటికీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పెద్దఎత్తున మట్టి తరలింపు కారణంగా భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు, చెరువు స్వరూపం దెబ్బతిని భవిష్యత్తులో సాగు, తాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలను తక్షణమే అడ్డుకోవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జరుగుమల్లి

దుర్వాసనతో ఇక్కట్లు



బిట్రగుంట పరిధిలోని పాలేరు సమీపంలో ఓ దాబా నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను నేరుగా బయటకు వదులుతుండటంతో చుట్టుపక్కల ప్రాంత ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాల కారణంగా ఆ ప్రాంతంలో విపరీతమైన దుర్వాసన వస్తోందని, అటు వైపు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. పొలాలకు వెళ్లేందుకు రైతులు సైతం నానా అవస్థలు పడుతున్నారు. వ్యర్థాల కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల పశువులు మేతకు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, జరుగుమల్లి

గుంపులుగా సంచరిస్తూ.. బెంబేలెత్తిస్తూ..


జమ్ములపాలెంలో ఓ వీధిలో శునకాలు

టంగుటూరు, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా శునకాలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. చీకటి పడితే చాలు వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. విద్యార్థులు ట్యూషన్లకు వెళ్లి వచ్చే సమయంలో తల్లిదండ్రులను వెంటబెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

రోడ్డు అంచులో గాజు ముక్కల పారబోత




టంగుటూరు, న్యూస్‌టుడే: విజయవాడ నుంచి తిరుపతికి గాజుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై బోల్తా పడింది. ఈ నెల 28న జరిగిన ఈ ప్రమాదంలో గాజు పెద్దమొత్తంలో ధ్వంసమై రోడ్డుపై చెల్లాచెదురుగా పడింది. ఆయా ముక్కలను ఒక చోటుకి ఊడ్చిన కార్మికులు.. దూరంగా జనసంచారం లేని ప్రాంతంలో పడేయకుండా రోడ్డు అంచున పారబోస్తున్నారు. అసలే టోల్‌ప్లాజా ప్రాంతం కావడంతో ఎవరైనా అంచులోకి దిగితే గాజు పెంకులు గుచ్చుకొని గాయపడే ప్రమాదం ఉంది.

నిండుకున్న నిల్వలు.. నిరుపయోగంగా పరికరాలు

టంగుటూరు, కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆరోగ్య కేంద్రాల్లో రక్త నిల్వల నిమిత్తం ఏళ్ల కిందట రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పరికరాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అత్యవసర చికిత్స నిమిత్తం వచ్చిన రోగులకు తగిన రక్త నిల్వలు అందుబాటులో లేక జిల్లా ఆసుపత్రులకు పంపుతున్నారు. లేదంటే ప్రైవేటు కేంద్రాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది.

❖ కొండపి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో (సీహెచ్‌సీ) నిత్యం 130 వరకు ఓపీ, పది మంది వరకు ఇన్‌పేషెంట్లు ఉంటారు. గర్భిణులు, అత్యవసర వైద్యం అవసరమైన వారికి చికిత్స చేయలేని పరిస్థితి నెలకొంది. గర్భిణులకు సంబంధించి వారి కుటుంబ సభ్యులు రక్తనిధి కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనికి ప్రధాన కారణం సీహెచ్‌సీ తగినన్ని నిల్వలు లేకపోవడమే. గతేడాది రక్తం నిల్వల నిమిత్తం ప్రభుత్వం రూ.32 లక్షలు వెచ్చించి పరికరాలను సమకూర్చింది.


కొండపి సీహెచ్‌సీలో రక్తనిల్వ పరికరాలు

జిల్లా వైద్య అధికారుల నుంచి అనుమతులు సైతం లభించాయి. కానీ రక్తం అందుబాటులో లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో కేంద్రాన్ని మరిన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం ఆయా పనులు చివరి దశకు చేరుకున్నాయి. గత రెండేళ్లుగా కేంద్రంలో పలు చికిత్సలు చేస్తున్నారు. అయితే సరిపడా రక్త నిల్వలు అందుబాటులో లేకపోవడంతో కొన్ని అత్యవసర కేసులను జిల్లా ఆసుపత్రులకు సిఫార్సు చేస్తున్నారు.


❖ వాస్తవానికి జిల్లా రక్తనిధి కేంద్రాలు శిబిరాలు ఏర్పాటు చేసి దాతల ద్వారా రక్తం సేకరించి ప్రాంతీయ ఆసుపత్రులు, సీహెచ్‌సీలకు పంపాలి. ఆ దిశగా చర్యలు లేకపోవడంతో జిల్లా కేంద్రాల్లోనే తగినన్ని నిల్వలు లేవని వైద్యులు చెబుతున్నారు. తద్వారా రోగి కుటుంబ సభ్యులు అత్యవసర వేళ రక్తం కోసం కందుకూరు, ఒంగోలు వంటి ప్రాంతాల్లోని ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. అదనంగా డబ్బు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేపటి నుంచి 'వక్త' పోటీలు

పామూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో మాట్లాడే నైపుణ్యాన్ని పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో వక్త కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా పామూరులో వక్త పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ పాఠశాల, కళాశాల, మండల, జిల్లా స్థాయిల్లో పోటీలు వచ్చే నెల 1వ తేదీ నుంచి అక్టోబర్ 30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలను నవంబరు 14న ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాధ, కొల్లా నాగేశ్వరరావు, కృష్ణాజి, శేషాద్రిరెడ్డి, రమేష్‌రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఆక్రమణ.. చోద్యం చూస్తున్న అధికార గణం

కందుకూరు: మండల కేంద్రం గుడ్లూరు పెట్రోలు బంకు ఎదురుగా సుమారు రూ.50 లక్షలు విలువైన ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించారు. ఈ విషయమై రెండ్రోజుల క్రితం తహసీల్దార్ బాలకిశోర్ హెచ్చరించినా.. లెక్కలేనితనంగా వ్యవహరిస్తున్నారు. ఆదివారం ఏకంగా ఆక్రమిత ప్రదేశంలో పట్టలతో గుడిసె ఏర్పాటు చేశారు. అంతకుముందు గ్రావెల్‌తో చదును చేశారు. వీరికి స్థానిక నాయకులు అండ ఉందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ కారణంగా అధికారులు పట్టించుకోకపోవడంతో విలువైన ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి తక్షణమే క్యాలెండర్ విడుదల చేయాలని డైఫీ మాజీ నాయకుడు, ఆర్టీసీ విశ్రాంత డిపో మేనేజర్ జి.శ్రీనివాసరావు డిమాండు చేశారు. ఒంగోలులోని జిల్లా యువజన సమాఖ్య కార్యాలయంలో ఆదివారం డైఫీ ఒంగోలు నగర మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. డైఫీ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య మాట్లాడుతూ.. మిగిలిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండు చేశారు. యువత సమస్యలపై డైఫీ నిరంతర పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కె.వంశీ, మోహన్, టి.మహేష్, వీరాస్వామి పాల్గొన్నారు.

వాడుతున్న చెట్లు.. కాపాడుకునేందుకు రైతుల పాట్లు

గుడ్లూరు, న్యూస్‌టుడే:

ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి తడి అందక తోటల్లోని మామిడి చెట్లు వాడుముఖం పడుతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా తడులు అందిస్తున్నారు. ఇప్పటికే కొన్ని చెట్లు ఎండిపోవటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ట్యాంకర్ ద్వారా మామిడి చెట్టుకు నీరు అందిస్తూ..

సుమారు 15వేల ఎకరాలు

గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లో సుమారు 15వేల ఎకరాల్లో మామిడి తోటలు న్నాయి. వాటిలో కొన్నింటికి బోరు వసతి లేకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఏటా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసే వర్షాలకు తోటలు ఏపుగా పెరుగుతాయి. ఈ ఏడాది ఇంత వరకు చినుకు జాడ లేకపోవడంతో పాటు ఎండ తీవ్రత వేసవిని తలపిస్తోంది. ఈ ప్రభావం తోటలపై పడింది. చెట్లకు సమృద్ధిగా నీరందక పోవడంతో ఎండుతున్నాయి.

మూడింటికి ఓ ట్యాంకరు

మూడు చెట్లకో ట్యాంకరు నీరు పెడుతున్నారు. గుడ్లూరు మండలం స్వర్ణాజీపురం వద్ద చెరువు కింద బావుల్లోని నీటిని వాటి యజమానులు ట్యాంకర్ల లెక్కన విక్రయిస్తున్నారు. రెండు ఎకరాల్లోని తోటకు నీరందించాలంటే మూడు రోజుల సమయం పడుతోందని రైతు మాల్యాద్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతఖర్చయినా తోటలను కాపాడుకుంటామని పలువురు చెబుతున్నారు.

ఒంగోలు
•ఒంగోలు • సంతనూతలపాడు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి జరుగుతాయని తెదేపా మండల అధ్యక్షుడు మద్దినేని హరి బాబు పేర్కొన్నారు. ఆదివారం సంతనూతలపాడులో ఇంటింటికీ తెదేపా కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు. కూటమి ప్రభుత్వ పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఎన్నో హామీలను అమలు చేసినట్లు వివరించారు. అనంతరం మై టీడీపీ యాప్‌లో వివరాలు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి చౌదరి, మాధవి, ఎం.శ్రీనివాసరావు, సాధు కొండలరావు, అడ్డగబొట్టు బాలకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం అందజేస్తున్న తెదేపా నాయకులు

ఆబాలగోపాలం.. ఆనందమయం

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: వచ్చే నెల 4న కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని సంస్కార భారతి ఆధ్వర్యంలో బాలగోకులం కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక అంజయ్య రోడ్డులోని ఏకేవీకే కళాశాల ఆవరణలో నిర్వహించారు. విద్యార్థులకు వర్ణచిత్ర, శ్రీకృష్ణుడు, రాధ వేషధారణ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వర్ణ చిత్ర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ సృజనకు పదును పెట్టారు. శ్రీకృష్ణుడు బాల్య ఘట్టాలు, గోకులం వాతావరణం, భారతీయ సంస్కృతి, సంప్రదాయ విలువలను ప్రతిబింబించేలా చిన్నారుల ప్రదర్శనలు సాగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పిల్లల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు సృజనాత్మకతను ప్రోత్సహించడమే బాలగోకులం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, తల్లిదండ్రులు

అంతా చేసి.. చివరిలో వదిలేసి



ఈ చిత్రంలోనిది చీమకుర్తి మండలంలోని గోనుగుంటలో అసంపూర్తిగా వదిలేసిన రైతు సేవా కేంద్రం భవనం. వైకాపా ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా అప్పటి పాలకులు దీని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గుత్తేదారుడికి బిల్లులు సకాలంలో ఇవ్వక పోవడంతో నాటి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో అప్పటి నుంచి ఇలా మిగిలిపోయింది. ఖాళీగా కనిపిస్తుండటంతో స్థానికులు తమ ద్విచక్ర వాహనాలు పెట్టుకోవడానికి, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. అధికారులు స్పందించి దీనిని అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, చీమకుర్తి**

పోలేరమ్మకు పొంగళ్లు

అద్దంకి, న్యూస్‌టుడే : వర్షాలు కురవాలంటూ మండలంలోని పేరాయపాలెంవాసులు పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. ఆదివారం ఉదయం స్థానికులంతా కలిసి అమ్మవారి ఆలయంలో జలాభిషేకం చేశారు. సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు. మహిళలంతా పొంగళ్లతో తరలివెళ్లి అమ్మవారికి సమర్పించారు. సకాలంలో వర్షాలు కురవాలని, పాడిపంటలతో గ్రామాలు కళకళలాడాలని మొక్కారు. అమ్మవారికి కట్టిన ప్రభ ఆకట్టుకుంది.

కాలువ ఇలా.. నీరు పారేదెలా?

న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

ఒంగోలు మండలం మండువవారిపాలెం వద్ద త్రోవగుంట మేజర్ కాలువ అభివృద్ధికి నోచుకోలేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో మరమ్మతుల ఊసే లేకపోవడంతో కాలక్రమేనా చిల్లచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో కాలువ నీరు ప్రవహించే లోతట్టు ప్రాంతమంతా ఇతరత్రా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. పూడికతీత పనులు చేపట్టకపోవడంతోపాటు, కాలువ గట్టు ప్రాంతం బలోపేతం చేయలేదు. కాలువల వారీగా నీటిని విడుదల చేసినా శివారు ప్రాంతానికి చేరే సరికి సగం నీరు వృథా అవుతోంది. మరోపక్క కాలువలపై ఉన్న ప్రధాన రహదారిలోని వంతెనల వద్ద ఎలాంటి మరమ్మతులకు నోచకోకపోవడంతో వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.


మండువవారిపాలెం వద్ద చిల్లచెట్లతో నిండిపోయిన కాలువ

సాగర్ నీరు విడుదల చేసిన సమయంలో సదరు కాలువ ద్వారా తొలుత నీటి నిల్వ ఎక్కువ సామర్థ్యం కలిగిన చీమకుర్తిలోని రామతీర్థం జలాశయాన్ని నింపుతారు. ఆ తర్వాత ఓబీసీ నుంచి ఒంగోలు నగరపాలక సంస్థకు చెందిన రెండు వేసవి జలాశయాలతోపాటు, ఒంగోలు, కొత్తపట్నం, సంతనూతలపాడు, మద్దిపాడు మండలాలకు చెందిన సాగు, తాగునీటి చెరువులను నింపుతారు. అందుకు ప్రధానంగా ఓబీసీ నుంచి దిగువ ప్రాంతమైన ఆయా మండలాల్లోని గ్రామా

నిర్వహణ లేక నీటి వృథా

లకు నీరు ప్రవహించేందుకు వీలుగా త్రోవగుంట మేజర్, అల్లూరు మైనర్, కొప్పోలు మేజర్ కాలువలు ఉన్నాయి. ఆయకట్టు ప్రాంతాలకు నీటి సరఫరాతోపాటు, వేసవిలో తాగునీటి అవసరాల నిమిత్తం గ్రామాల్లోని చెరువులకు విడుదల చేస్తారు. త్రోవగుంట మేజర్ కాలువ ద్వారా మద్దిపాడు మండలం లింగంగుంట, ఒంగోలు మండలం మండువవారిపాలెం, ముక్తినూతలపాడు, దశరాజుపల్లెలోని తాగునీటి చెరువులను నింపుతారు. అంత ప్రాధాన్యం గల కాలువలకు మరమ్మతులు గురించి పట్టించుకోలేదు. కనీస నిర్వహణ పనులు కూడా చేయకపోవడంతో పిచ్చిమొక్కలు, చిల్లచెట్లు పెరిగిపోయాయి. కొన్ని చోట్ల కాల్వ కట్టలు కోసుకుపోవడంతో పాటు, నెర్రెలకు గురయ్యాయి. తద్వారా నీటి వృథా ఎక్కువగా ఉంటుంది. వాటి నిర్వహణకు క్షేత్రస్థాయి ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు తయారుచేసినా కాగితాలకే పరిమితమయ్యాయి.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఒంగోలు నగరం	: 8008574067
ఒంగోలు గ్రామీణం	: 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు	: 8247324766
కొత్తపట్నం	:8464085451
ఎస్.ఎన్.పాడు	: 8008552692

అంజయ్యరోడ్డు: ?: ఒంగోలు నగరంలోని క్లౌపేటలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. చిన్నారులు, వృద్ధులు బయట తిరిగేటప్పుడు దాడి చేస్తాయని స్థానికులు భయపడుతున్నారు. కుక్కలను పట్టించి ఇక్కడ నుంచి తరలించాలి. **-రామ్మోహనరావు, స్థానికుడు**
✓: శునకాలను పట్టుకునే వారిని పిలిపించి వాటిని తరలిస్తాం. **-బాజ్జీ, శానిటరీ సూపర్‌వైజర్**

చీమకుర్తి: ?: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక వీధిలోని పెద్ద భవనం సమీపంలో విద్యుత్తు స్తంభానికి చెట్టు తీగలు అల్లుకుపోయాయి. దీనివల్ల తరచూ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. చెట్టు తొలగింపు దిశగా తగిన చర్యలు చేపట్టాలి.
-ఎం.శ్రీనివాసరావు, స్థానికుడు
✓: వెంటనే తీగలను తొలగింపజేస్తాం.
-చంద్రశేఖర్, విద్యుత్తు ఏఈ

నాగులుప్పలపాడు: ?: గ్రామంలోని బొడ్రాయి సెంటర్ వద్ద మురుగు కాలువలను సరిగా శుభ్రం చేయడం లేదు. కాలువ నిండా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. **-ఆంజనేయులు, గ్రామస్థుడు**
✓: పరిశీలించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపడతాం. **-ప్రత్యూస, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి**

మద్దిపాడు: ?: మద్దిపాడు ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఎదుట వీధిలో మురుగునీరు రహదారిపైకి వస్తోంది. దీనివల్ల ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. దుర్వాసన సైతం వస్తోంది. **-కె.శ్రీధర్, కాలనీవాసి**
✓: పారిశుద్ధ్య సిబ్బందితో మురుగునీరు తొలగించి బ్లీచింగ్ వేయిస్తాం.
-నూరుల్లా, పంచాయతీ అభివృద్ధి అధికారి

క్రీడాకారులను తీర్చిదిద్దినందుకు అవార్డు

మద్దిపాడు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అందించే క్రీడా ప్రతిభా అవార్డుకు మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎంపికైందని ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వనజ, సౌజన్యలు ఆదివారం తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న వీటిని అందించినట్లు తెలిపారు. ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు అత్యధిక క్రీడాకారులను అందించిన 5 పాఠశాలలను ఈ అవార్డులకు ఎంపిక చేశారన్నారు. ఇందులో మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మూడో స్థానం లభించిందని వారు తెలిపారు. శనివారం ఒంగోలులో విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడా పురస్కారాన్ని డీఈవో సీవీ రేణుక చేతుల మీదగా అందుకున్నట్లు వారు తెలిపారు.


డీఈవో రేణుక చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న పీడీలు వనజ, సౌజన్యలు

దాగి ఉన్న ప్రమాదం



స్థానిక రంగారాయుడు చెరువు నుంచి బండ్లమిట్ట సెంటర్‌కు వెళ్లే రహదారిలో డీఎల్‌డీఏ కార్యాలయం ఎదురుగా ఉన్న మొదటి అడ్డరోడ్డు మార్జిన్ వెంబడి పెద్ద గుంత ఉంది. అందులోకి చుట్టుపక్కల నివాసాల నుంచి మురుగునీరు చేరుతోంది. ఆ మార్గం నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. గమనించకపోతే గుంతలో పడే అవకాశం ఉంది. నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్**

ఇదే సూచిక.. చూడాలిక



ఒంగోలు పాత మార్కెట్ సెంటర్‌లో ప్రధాన రోడ్డు మార్జిన్‌లోని మురుగు కాలువ మ్యాన్‌హోల్‌పై ప్లేటు లేదు. ప్రమాదవశాత్తూ అందులో ఎవరూ పడకుండా గుంత వద్ద కర్రకు వస్త్రం కట్టి ఉంచారు. ఆ మార్గాన రాకపోకలు సాగించేవారు అదే సూచికగా భావించాల్సిన పరిస్థితి. రాత్రివేళ దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదు. తక్షణమే దానిపై ప్లేటు అమర్చాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం**

తీరం.. అప్రమత్తత అవసరం

కొత్తపట్నం మండలంలోని కె.పల్లెపాలెం సముద్రతీరంలో ఆదివారం సందర్శకులు సందడి చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు సెలవు కావడంతో కుటుంబ సభ్యులు, చిన్నారులతో కలిసి తరలివచ్చారు. మరోవైపు ఎండలు మండుతుండటంతో జిల్లా నలుమూలల నుంచి ఉదయం పది గంటలకే పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. సాయంత్రం 6 గంటల వరకు సముద్ర తీరంలో రద్దీ నెలకొంది. పర్యాటకులు స్నానాలు చేసేందుకు సముద్రం లోపలికి వెళ్లిపోకుండా ఒడ్డునే స్నానాలు చేసేలా మెరైన్ పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తూ అప్రమత్తం చేశారు. **-న్యూస్‌టుడే, కొత్తపట్నం**



మంచినీరు వృథా



ఇది మద్దిపాడులోని సిండికేట్ బ్యాంకు ఎదురుగా పైపు లైన్ లీకై తాగునీరు వృథాగా రోడ్డుపై పోతున్న చిత్రం. కొద్ది రోజుల నుంచి మంచినీరు ఇలాగే వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనివల్ల దిగువ ప్రాంతాల ప్రజలు నీరు సరిగా అందక ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహించి అందరికీ నీరందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, మద్దిపాడు

వెలిగొండకు ప్రత్యేక బస్సులు

అద్దంకి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం మార్కాపురం జిల్లాలో వెలిగొండ ప్రారంభోత్సవానికి రానున్నారు. ఈ నేపథ్యంలో అద్దంకి ఆర్టీసీ డిపో నుంచి 30 పల్లెవెలుగు బస్సుల్ని కేటాయించడంతో అక్కడికి తరలివెళుతున్నాయని మేనేజరు మహబూబీ తెలిపారు.


అశోక్‌ను సన్మానిస్తున్న అధికారులు

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 37 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేసి గ్రామాల అభివృద్ధికి పీఆర్ ఎస్‌ఈ అశోక్ ఎనలేని కృషి చేశారని నెల్లూరు పీఆర్ ఎస్‌ఈ కోటేశ్వరరావు కొనియాడారు. ఒంగోలులోని ఎంఎస్ ఫంక్షన్ హాలులో ఆదివారం పంచాయతీరాజ్ ఎస్‌ఈ జి.అశోక్ ఉద్యోగ విరమణ సన్మానసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతోపాటు, నాయకత్వ లక్షణాల ద్వారా గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోనూ ఏఈ నుంచి ఉద్యోగం ప్రారంభించి స్థానికంగా తాగునీటి సరఫరాతోపాటు, పంచాయతీరాజ్ అభివృద్ధి పనుల త్వరితగతిన పూర్తికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు నాగరాజు, రతన్‌బాబు, సుమన, డీఈలు కృష్ణమోహన్, మాధవరావు, ప్రసాద్, నాగేశ్వరరావు, శివప్రసాద్, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ కోశాధికారి మృతికి సంతాపం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి రోటరీక్లబ్ కోశాధికారి, ప్రముఖ ఆడిటర్ దుడ్డు శంకర్ (68) గుండె పోటుతో శనివారం రాత్రి హఠాన్మరణం పొందారు. పదిహేను సంవత్సరాలుగా ఆయన రోటరీ క్లబ్‌కు సేవలందిస్తున్నారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, రోటరీక్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు చెరుకూరి రఘుకిరణ్, డాక్టర్ వెంకటేశ్వర్లు, గ్రానైట్ యజమానుల సంఘం, ఆర్యవైశ్య సంఘం నాయకులు తమ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భగవద్గీత శ్లోకాలను దోష రహితంగా పఠించండి

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో భక్తియోగంపై త్వరలో జరగనున్న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయం సాధించేందుకు కృషి చేయాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి పేర్కొన్నారు. ఆదివారం శ్రీగిరి గోశాల భవన్‌లో వేంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బాలవిహార్ శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను దోష రహితంగా నేర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు గౌరమ్మ, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సెప్టెంబర్ 4వ తేదీ ఉదయం శ్రీగిరిలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇందులో పాల్గొనదలచిన మహిళలు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.


బాలవిహార్ శిక్షణ తరగతులకు హాజరైన చిన్నారులతో నిర్వాహకులు


కొలువుదీరిన అమ్మవారు

ముగిసిన నాగార్పమ్మ కొలుపులు

సంతనూతలపాడు: సంతనూతపాడులో నాగార్పమ్మతల్లి కొలుపులు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. నల్లగట్ల కుటుంబీకుల ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు ఈ మహోత్సవాలు నిర్వహించారు. నూతనంగా అయ్యగారి, అమ్మగారి, నాగార్పమ్మతల్లి దేవర ఆలయాన్ని నిర్మించారు. ఆదివారం ఆలయంలో దేవతామూర్తులు కొలువుదీరారు. శనివారం రాత్రి గ్రామోత్సవం చేపట్టగా ఆదివారం విశేష పూజలు చేశారు. పెద్ద ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సంతనూతలపాడు పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐ ఎం.శేషగిరిరావులు ఆదివారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన వంకాయలపాటి మహేష్ అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన మంగమూరి నాగూర్‌వలి కులం పేరుతో తిట్టి, దాడి చేశారన్నారు. దీనిపై మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై డీఎస్పీ, సీఐలు విచారణ చేపట్టారు. వివాదం ఎలా జరిగింది, ఎందుకు జరిగిందనే విషయాలపై పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఏఎస్సై హనుమంతరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామంలో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శేషగిరిరావు తదితరులు

పల్లె దారులు.. పూడ్చని గుంతలు

న్యూస్‌టుడే, కొత్తపట్నం : కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలతో అధ్వానంగా మారాయి. కొన్ని చోట్ల భారీ గోతులు వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాయి. పొరపాటున చూసుకోకపోతే బోల్తా పడి ప్రమాదాలు జరిగేలా పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు కనీసం మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.


పాదర్తి-పిన్నివారిపాలెం ప్రధాన రహదారిలో గోతులు

రద్దీ రోడ్లు సైతం అధ్వానంగా..

మండలంలోని ఈతముక్కల నుంచి సూరారెడ్డిపాలె వరకు, పాదర్తి గ్రామం నుంచి పిన్నివారిపాలెం వరకు రహదారుల్లో పెద్దపెద్ద గోతులు ఉన్నాయి. మోటుమాల నుంచి బీరగుంట, కొత్తపట్నం నుంచి కొప్పోలు వరకు ఉన్న రోడ్లపైనా గుంతలు పడ్డాయి. కొత్తపట్నం-ఒంగోలు నగరాన్ని కలిపే ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో రాకపోకలు సాగించాలంటే నానా అవస్థలు తప్పడం లేదని చెబుతున్నారు. ద్విచక్ర వాహనాల వారు, ఆటో చోదకులు తమ వాహనాలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి తక్షణమే క్యాలెండర్ విడుదల చేయాలని డైఫీ మాజీ నాయకుడు, ఆర్టీసీ విశ్రాంత డిపో మేనేజర్ జి.శ్రీనివాసరావు డిమాండు చేశారు. ఒంగోలులోని జిల్లా యువజన సమాఖ్య కార్యాలయంలో ఆదివారం డైఫీ ఒంగోలు నగర మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. డైఫీ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య మాట్లాడుతూ.. మిగిలిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండు చేశారు. యువత సమస్యలపై డైఫీ నిరంతర పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కె.వంశీ, మోహన్, టి.మహేష్, వీరాస్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సేవలు అభినందనీయం

చీమకుర్తి: ఉపాధ్యాయుడిగా కంచి రంగారెడ్డి వివిధ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి అందజేసిన సేవలు అభినందనీయమని మండల విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. చీమకుర్తి మండలం చంద్రపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేయనున్న రంగారెడ్డి అభినందన సభ ఆదివారం పాఠశాలలో జరిగింది. ప్రధానోపాధ్యాయులు షేక్ పీర్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రంగారెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ పత్రికకు రూ.25 వేల విరాళం అందజేశారు. చీమకుర్తి, సంతనూతలపాడు, ఒంగోలు, జరుగుమల్లి మండలాల ఎంఈవోలు డీవీఎల్.నరసింహారావు, కె.శివాజీ, డి.కుమార్, డి.వెంకారెడ్డి, టి.కిశోర్‌బాబు, బి.నాగేంద్ర వదన్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.